## మంచిమాట

దేవాలయాలలో విగ్రహాలలోకాక
నిరుపేదలలో బలహీనులలో
ఆపన్నులలో భగవంతుడిని
దర్శించేవారంటేనే దేవుడికి ఇష్టం.
సాటిమనిషికి సాయం చేయనివాడు
భగవంతుడిని బంగారుపూలతో
పూజించినా వ్యర్థమే.



నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

నిజాల నిగ్గు తేల్చే చర్చ తెలుగు దిన పత్రిక

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155



తెలంగాణ , సంపుటి : 28 సంచిక : 86 ఆదివారం, డిసెంబర్ 21, 2025 , పేజీలు - 12 వెల : 2/-


## హైదరాబాద్ చేరుకున్న ఉపరాష్ట్రపతి



**హైదరాబాద్,డిసెంబర్ 20 :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారు. ద్రౌపది ముర్ము ఇప్పటికే నగరానికి రాగా.. శనివారం సీపీ రాధాకృష్ణన్ చేరుకున్నారు. మధ్యాహ్న సమయంలో శంషాబాద్ విమానాశ్రయానికి ఆయన చేరుకోగా.. మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు ఘనస్వాగతం పలికారు. నేడు జరిగే పబ్లిక్ మిగతా2లో...



## పశ్చిమబెంగాల్లో మహా జంగిల్ రాజ్

### చొరబాటుదారులకు అండగా మమత

### విరుచుకు పడ్డ ప్రధాని మోడీ

**కోల్‌కతా, 20 :** తృణమూల్ కాంగ్రెస్ సారథ్యంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చొరబాటుదారులను కాపాడుకునేందుకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని, బెంగాల్‌లో చొరబాటు దారులకు టీఎంసీ ప్రాపకం లభిస్తోందని విమర్శించారు. తహెర్‌పూర్‌లో శనివారం మిగతా2లో...

# ప్రేమించే గుణాన్ని పంచిన ఏసు ప్రభువు

### ఎల్బీనగర్ క్రిస్మస్ వేడుకల్లో సిఎం రేవంత్

### ఆజ్మీర్ దర్గాకు సిఎం ఛాదర్ సమర్పణ

**హైదరాబాద్,డిసెంబర్ 20 :** ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి జరుపుకునే పండుగగా క్రిస్మస్.. ద్వేషించే వారికి కూడా ప్రేమించే గుణాన్ని ఏసు ప్రభువు మానవాళికి స్ఫూర్తిగా అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా డిసెంబర్ ఒక మిరాకిల్ మంత్‌గా మారిందని వ్యాఖ్యానించారు. రాజకీయంగా మిగతా2లో...



# ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు డౌటే...



### కెసిఆర్ ఫీల్డ్‌లోకి రాకున్న అద్భుత ఫలితాలు

### తాండూరు నియోజకవర్గ సర్పంచ్‌లతో కెటిఆర్

**హైదరాబాద్,డిసెంబర్ 20 :** ప్రస్తుత పంచాయితీ ఫలితాలు చూశాక, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు పెడతారని అనుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలు చూసి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెడతారని అనుకోవడం లేదు.. పంచాయతీ ఎన్నికల ఫలితాల విషయంలో రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో ఐదు నిమిషాలకే మాట మార్చారు అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కేసీఆర్ కాలు బయట పెట్టకపోయినా గులాబీ సైనికులు అద్భుతంగా పోరాడారు, ప్రభుత్వం భయపడే పరిస్థితి వచ్చింది అని కేటీఆర్ అన్నారు. తమకు ఉన్న హక్కులు, నిధులు, విధుల గురించి కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. రాజ్యాంగం ప్రకారం ఐదంచెల్లో ప్రభుత్వాలు ఉన్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీలకు ఇచ్చే నిధులు సొంత ఆస్తులు, డబ్బులు కావని పేర్కొన్నారు. కమిషన్ ద్వారా జనాభా ప్రాతిపదికన నిధులు ఇస్తారని మిగతా2లో...

# ఉపాధిలో గాంధీ పేరు తొలగించడం దారుణం

### - కేంద్రం తీరుపై మండిపడ్డ సోనియా



**న్యూఢిల్లీ,డిసెంబర్ 20 :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చడంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఈ పథకాన్ని నీరుగార్చేందుకు మోదీ ప్రభుత్వం దశాబ్దకాలంగా అనేక ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. ఇటీవల ఈ చట్టంలో ఏకపక్షంగా మార్పులు చేయడంతోపాటు దేశంలో కోట్లాదిమంది రైతులు, కార్మికులు, భూమిలేని వారి ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వం దాడి చేసిందని మండిపడ్డారు. ఈ మేరకు సోనియా మిగతా2లో...




## విశాఖలో వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ

# ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు

### జాబ్ క్యాలెండర్ ఉండాల్సిందే

### లేకుంటే యువత భవిష్యత్ దెబ్బతింటుంది

### తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, 20 :** పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. న్యాయమైన, పారదర్శక నియామకాల ద్వారానే ప్రజాసేవలో ప్రతిభకు స్థానం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన 26వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల మిగతా2లో...

## కెసిఆర్ అధ్యక్షతన నేడు బీఆర్ఎస్ శాసనసభాపక్షం భేటీ

### నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానంగా చర్చ

### ఇదే అంశంపై ఉద్యమ కార్యాచరణకు బిఆర్ఎస్ సిద్ధం

### మీడియాతో మాట్లాడి వివరాలు వెల్లడించనున్న కెసిఆర్




**హైదరాబాద్, 20 :** తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్ఎస్ శాసనసభాపక్షం, రాష్ట్ర కార్యవర్గం భేటీ కానుంది. పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో నేతలు సమావేశం కానున్నారు. ఇందులో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొననున్నారు. నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టుల మిగతా2లో...

# ఆఫర్ల పేరుతో సైబర్ నేరాలు

### అప్రమత్తంగా ఉండాల్సిందే


### ప్రజలను హెచ్చరించిన సిపి సజ్జన్నార్



**హైదరాబాద్,డిసెంబర్ 20 :** ఏపీకే ఫైల్స్, ఓటీపీ, బ్యాంక్ ట్రాన్సిషన్ పై అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బయట రాష్ట్రాల్లో ఉండి నిందితులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. వేరొక స్టేట్స్ లో ఉన్న నిందితుల్ని గుర్తించడం, డబ్బును రికవరీ చేయడం కష్టంగా మారింది. మిగతా2లో...

# పంచాయితీ ఎన్నికలపై కాంగ్రెస్ పోస్ట్‌మార్టమ్

### 16 మంది ఎమ్మెల్యేల పనితీరుపై ఆగ్రహం



**హైదరాబాద్,డిసెంబర్ 20 :** పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అధిష్ఠానం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డి , టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై చర్చించారు. ఇటీవలి ఫలితాలపై పోస్ట్మార్టమ్ నిర్వహించారు. రెబల్స్‌ను సమన్వయం చేయలేని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులపై రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ అసహనం మిగతా2లో...

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక



# పశ్చిమబెంగాల్లో మహా జంగిల్ రాజ్

(మొదటి పేజీ తరువాయి)

నాడు జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఫోనులో ప్రధాని మాట్లాడుతూ, పశ్చిమబెంగాల్లో టీఎంసీ 'మహా జంగిల్ రాజ్'కు బీజేపీ చరమగీతం పాడుతుందని చెప్పారు. అవినీతి, ఆశ్రితపక్షపాతం, బుజ్జగింపు రాజకీయాలు రాష్ట్రాన్ని ఏలుతున్నాయని ఆరోపించారు. 'వాళ్లు బీజేపీని ఎంత గట్టిగానైనా వ్యతిరేకించనీయండి. కానీ పశ్చిమబెంగాల్ అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారో నాకయితే అర్థం కావడం లేదు. మీరు మోదీని వ్యతిరేకించండి, కానీ ప్రజల సంతోషాన్ని అడ్డుకోకండి. ప్రజల హక్కులను కాలరాయకండి. వారి కలలను చెల్లాచెదురు చేసే పాపానికి ఒడికట్టకండి. బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వమని పశ్చిమబెంగాల్ ప్రజలకు ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాను' అని మోదీ విజ్ఞప్తి చేశారు. కాగా, వాతావరణ ప్రతికూలత కారణంగా మోదీ హెలికాప్టర్ తహెర్‌పూర్‌లో దిగలేకపోయింది. దీంతో ఆయన కోల్‌కతా విమానాశ్రయానికి తిరిగి వెళ్లిపోయారు. పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లా రణఘాట్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.3,200 కోట్లతో నిర్మించనున్న రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు కోల్‌కతాను సిలిగురితో అనుసంధానిస్తూ సుమారు రెండు గంటల ప్రయాణ సమయం ఆదా చేస్తాయని పీఎంఓ తెలిపింది. ఈ ప్రాజెక్టులతో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం కావడంతో పాటు పర్యాటకం కూడా పెరుగుతుందని పేర్కొంది.

# ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు డౌటే...

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. బీఆర్ఎస్ హయాంలో ఫైనాన్స్ కమిషన్ ద్వారా రూపాయి వస్తే.. మరో రూపాయి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. గ్రామ పంచాయతీలకు పథకాలను ఆపే శక్తి ఎవరికీ లేదని స్పష్టం చేశారు. తాండూర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వానికి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టే దమ్ము లేదని కేటీఆర్ విమర్శించారు. మాకే నిధులు ఇవ్వడం లేదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే డైరెక్ట్‌గా చెప్పిండని గుర్తుచేశారు. నిధులు ఇవ్వాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే వరల్డ్ బ్యాంకుకు లేఖ రాసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న చోట అభివృద్ధి అనేది ఉండదని అన్నారు. కేసీఆర్ హయాంలో డంపింగ్ యార్డ్‌లు, ప్లలె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారని తెలిపారు. దీనివల్ల 21 జాతీయ పంచాయతీ అవార్డులను తెలంగాణ సాధించిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలు గెలవడం సులభం.. కానీ పంచాయతీ ఎన్నికల్లో గెలవడమే కష్టమని కేటీఆర్ తెలిపారు. ఈ రెండేళ్లు మనకు కష్టంగా ఉంటుందని కొత్తగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో అన్నారు. రేవంత్ సర్కార్ అన్ని వర్గాలను మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. షాపుల యూరియా ఇవ్వనోడు.. యాప్‌ల యూరియా ఇస్తాడంట అని ఎద్దేవా చేశారు. 2014 నాటికి తెలంగాణ అప్పు రూ.72 వేల కోట్లుగా ఉందని తెలిపారు. 2023 నాటికి తెలంగాణ అప్పు రూ.మూడున్నర లక్షల కోట్లు అయ్యిందని అన్నారు. అంటే.. బీఆర్ఎస్ హయాంలో రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేశారని వివరించారు. అంటే కేసీఆర్ చేసిన మొత్తం అప్పు రూ.2.80 లక్షల కోట్లే అని తెలిపారు. అదే రేవంత్ రెడ్డి అప్పు తెచ్చి ఏంచేసిండో చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని కేటీఆర్ తెలిపారు. తాండూరులో ఉండే 36 వార్డుల్లో ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని అన్నారు.తాండూరు నియోజకవర్గం నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ వారిని సన్మానించారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ ప్రోగ్రెస్ ఉండదు.. రెండేళ్లు మనకు కష్టాలు తప్పవు అని సెటైర్లు వేశారు. అయితే, కారు గుర్తు ఉండి, కేసీఆర్ గుర్తుకు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి అని కేటీఆర్ తెలిపారు. రెండేళ్లు బీఆర్ఎస్ కు పరీక్ష కాలం.. కాంగ్రెస్ వాళ్లు ఏమైనా అంటే తలదించుకుని వెళ్లండి, రెండు అడుగులు వెనక్కు వెళ్లండి అని సూచించారు. పంచాయతీలకు డబ్బులు కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వస్తాయి, ఎవరి ప్రమేయం ఉండదన్నారు. బీఆర్ఎస్ సర్పంచులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వమని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే అంటున్నారు.. ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు ఇలా అన్నింటి జాబితా పంచాయతీల్లో పెట్టాల్సిందే.. సర్పంచులు, పంచాయతీల చేతిలోనే ఉంటుంది.. నిధులు రావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెప్తున్నారు.. కాంగ్రెస్ చేతిలో మోసపోని వారంటూ ఎవరూ లేరు, అందరూ బాధపడుతున్నారు.. జనవరి, ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు వస్తాయని అంటున్నారు.. ఇప్పటి నుంచే సిద్ధం కావాలి.. గ్రామీణ ప్రాంతాల వారికి మున్సిపల్ ఎన్నికల బాధ్యతలు అప్పగించండి అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.

# కెసిఆర్ అధ్యక్షతన నేడు బీఆర్ఎస్ శాసనసభాపక్షం భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అంశంపై పోరుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఈ సమావేశంలో వీటిపై కేసీఆర్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు సమాచారం. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు, పార్టీ నేతలతో సమావేశాలను కూడా కేసీఆర్ అక్కడి నుంచే నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ రెండేళ్లలో కేసీఆర్ ప్రజలకు కనిపించింది చాలా అరుదనే చెప్పుకోవాలి. అయితే తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం కేసీఆర్ రంగంలోకి దిగనున్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ అధినేత రానున్నారు.కేసీఆర్ అధ్యక్షతన రేపు మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరుగనుంది. నదీ జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై కేసీఆర్ సమరశంఖం పూరించనున్నారు. తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం మరో ప్రజా ఉద్యమంపై మాజీ సీఎం దిశానిర్దేశర చేయనున్నారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశం తర్వాత కేసీఆర్ మీడియాతో మాట్లాడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో 45 టీఎంసీలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందనేది బీఆర్ఎస్ వాదన. నదుల అనుసంధానం పేరుతో ఏపీ జలదోపిడీకి కేంద్రం సహకరిస్తోందని ఆ పార్టీ ఆరోపిస్తోంది. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా నోరు మెదపటం లేదని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి. కాంగ్రెస్, బీజేపీలను తెలంగాణ సమాజం ముందు దోషిగా నిలబెడతామని బీఆర్ఎస్ చెబుతోంది. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ ప్రక్షాళనలపైనా కేసీఆర్ దృష్టి సారించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కేసీఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. చాలా రోజుల తర్వాత తమ అధినేత తెలంగాణ భవన్‌కు రానుండటంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

**ప్రభాకర్ రావుపై విచారణ వేగవంతం**

**ఆధారాలు రాబల్లే యత్నాల్లో అధికారులు**




**హైదరాబాద్,డిసెంబర్ 20 :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ వేగం పెంచింది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు శనివారం నుంచి కీలక విచారణను ప్రారంభించారు. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరో వారం రోజుల పాటు సుప్రీం కోర్టు పొడిగించింది. ఇందులో భాగంగా ప్రభాకర్ రావును పోలీసులు మళ్లీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టనున్నారు.వారం రోజుల విచారణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు, మరికొందరి పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ పీఎస్‌లో ప్రస్తుతం ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసును సమగ్రంగా పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సిట్‌ను నియమించగా.. ఆ బృందంతో శుక్రవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేసు పురోగతి, విచారణ విధానం, సాంకేతిక అంశాలు, ఆధారాల సేకరణ వంటి పలు కీలక విషయాలపై సిట్ అధికారులకు సీపీ స్పష్టమైన దిశానిర్దేశర చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం ఉదయం నుంచే పలువురు సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణ ప్రారంభించారు. అధికారులు ఈ వారం రోజుల పాటు ప్రభాకర్ రావును నిరంతరంగా ప్రశ్నించనున్నారు. సిట్ విచారణను సమర్థవంతంగా నిర్వహించేందుకు బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక రూమ్‌ను కేటాయించారు. అక్కడే కస్టోడియల్ విచారణ జరగనుంది. ప్రభాకర్ రావును ఈ నెల 25వ తేదీ వరకు కస్టడీలో ఉంచి విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతి లభించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఇతర నిందితులను కూడా సిట్ అధికారులు పిలిపించి, ప్రభాకర్ రావు ఎదుటే ప్రశ్నిస్తున్నారు. గతంలో వారు ఇచ్చిన స్టేట్‌మెంట్లు, సాంకేతిక ఆధారాలు, డేటా విశ్లేషణ ఆధారంగా ప్రభాకర్ రావును సమగ్రంగా విచారిస్తున్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా భావిస్తున్న ప్రణీత్ రావుతో కలిపి కూడా ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణలు, ఆదేశాలు, అమలైన విధానం, రాజకీయ నేతలు, ఇతరుల ఫోన్ల ట్యాపింగ్ అంశాలపై స్పష్టత కోసం అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# పంచాయితీ ఎన్నికలపై కాంగ్రెస్ పోస్ట్‌మార్టమ్

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో సరిగా పనిచేయని 16 మంది ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా నల్లగొండలో ఎమ్మెల్యేల్లో సమన్వయ లోపం కనిపించిందని భావించారు. రెబల్స్‌తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని తప్పుబట్టారు. పార్టీకి తీరని నష్టం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వైఖరి మార్చుకుని పార్టీ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని ఆదేశించారు. తెలంగాణలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది.

మొదటి, రెండో విడతల్లో సుమారు 56 శాతం స్థానాలను గెలిచిన పార్టీ మూడో విడతలోనూ అదే ఆధిక్యాన్ని కొనసాగించింది. 31 జిల్లాల్లోని 12,733 పంచాయతీ సర్పంచి పదవులకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి.

ఇందులో 7,010 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది.
3,502 స్థానాల్లో భారాస గెలుపొందింది. భాజపా 688 స్థానాలు పొందగా... ఇతరులు 1,505 స్థానాల్లో గెలిచారు.
అయితే తమకు పట్టున్న కొన్ని చోట్ల స్థానాలను కోల్పోవడంపై కాంగ్రెస్ అధిష్టానం సీరియస్‌గా ఉంది. ఈక్రమంలోనే దానికి బాధ్యులైన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ బాధ్యులతో సమావేశం నిర్వహించింది.

# ఉపాధిలో గాంధీ పేరు తొలగించడం దారుణం

(మొదటి పేజీ తరువాయి)

గాంధీ ఓ వీడియో మెసేజ్ రిలీజ్ చేశారు.సరిగ్గా 20 ఏళ్ల క్రితం మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకాన్ని పార్లమెంటు ఏకాభిప్రాయంతో ఆమోదించిన విషయాన్ని సోనియా గాంధీ గుర్తుచేశారు. అదో విప్లవాత్మకమైన అడుగు అని.. అత్యంత పేదలు, అణగారినవారి జీవితాలకు ఆ పథకం ఉపాధి మార్గంగా నిలిచిందన్నారు. వలసలు ఆగిపోవడమే కాకుండా, ఉపాధికి హామీ దక్కిందన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు అనుగుణంగా తీసుకొచ్చిన ఆ పథకాన్ని మోదీ ప్రభుత్వం అణచివేసిందని ఆరోపించారు.గడిచిన 11 ఏళ్లుగా గ్రామీణ పేదల ప్రయోజనాలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం.. మహాత్ముడి పేరును తొలగించడమేగాక పథకం స్వరూపాన్నే మార్చిందని సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎలాంటి చర్చ లేకుండా, ఎవరినీ సంప్రదించకుండా, విపక్షాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా చట్టాన్ని మార్చివేయడం దారుణమని అన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడేందుకు లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

# విశాఖలో వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ

**విశాఖపట్నం,డిసెంబర్ 20 :**భారత మాజీ ప్రధాని, దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయా కాంస్య విగ్రహాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ విశాఖపట్నంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. వాజ్‌పేయ్ దార్శనికతను కొనియాడారు.

# ఆఫర్ల పేరుతో సైబర్ నేరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సైబర్ మోసాల కారణంగా హైదరాబాద్ ప్రజలు రోజుకు కోటి రూపాయలు నష్టపోతున్నారు. అలానే సైబర్ నేరగాళ్లు రెండు విధాలుగా నేరాలకు పాల్పడుతున్నారు. ఒకటి పెట్టుబడి పేరుతో మోసం చేస్తున్నారు.... రెండోవది డిజిటల్ అరెస్ట్ తో మోసం చేస్తున్నారని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ తో ఎక్కువగా వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు మోసపోతున్నారు. ప్రజలు సైబర్ కేటుగాళ్లు, వాళ్ల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏమైనా అనుమానాస్పద కాల్స్ వస్తే 1930 కి లేదా 100 కి కాల్ చేయాలన్నారు. రాబోయే పండుగలు సంక్రాంతి, క్రిస్మస్ సందర్భంగా సైబర్ నేరగాళ్లు ఆఫర్ల పేరుతో మోసాలకు పాల్పడే అవకాశం ఉంది. ఇక మధుర నగర్‌లో ట్రాఫిక్ సమస్యల నివారణకు త్వరలో చర్యలు కూడా తీసుకుంటాం. మధుర నగర్ పోలీస్ స్టేషన్ ను త్వరలోనే ప్రజలకి అనువుగా అందుబాటులో ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేస్తాం' అని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పై కూడా సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో సిట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ జరుగుతుందని, త్వరలో అన్ని వివరాలు తెలియజేస్తామని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో అన్ని వివరాలు సేకరిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి సిట్ కార్యాలయం విషయంలో ఆలోచన చేస్తున్నామని, ప్రస్తుతం జూబ్లీహిల్స్ పీఎస్ లోనే ఫోన్ ట్యాపింగ్ సంబంధించి విచారణ సాగుతుందని తెలిపారు. మరోవైపు ఐ బొమ్మ రవి కేసు గురించి అడిషనల్ సీపీ శ్రీనివాస్ పలు విషయాలను వెల్లడించారు. 'ఐ బొమ్మ రవి విచారణ జరుగుతుంది. సమాధానాలు చెప్పడంలేదని బయట ఊహాగానాలు వస్తున్నాయి. మా స్టైల్ లో మేము విచారణ చేస్తున్నాము. అతని నుండి సమాధానాలు రాబడుతున్నాం' అని ఆయన వెల్లడించారు.

# ప్రేమించే గుణాన్ని పంచిన ఏసు ప్రభువు

(మొదటి పేజీ తరువాయి)

భారీ మూల్యం చెల్లించి, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీకి నష్టం జరిగినప్పటికీ సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, గతంలో సోనియా గాంధీ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్‌ను తీసుకొచ్చి పేదలకు భరోసా కల్పించారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈరోజు తెలంగాణలో తమ ప్రభుత్వం పేదలకు దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. అలాగే, విద్య, వైద్యం లాంటి కీలక సేవలను ప్రభుత్వంతో సమానంగా క్రిస్టియన్ మిషనరీలు కూడా పేదలకు అందిస్తూ, సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ముఖ్యమంత్రి ప్రశంసించారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, సేవ, త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుంది.. ఆ విలువలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇదిలావుంటే అజ్మీర్ షరీఫ్ దర్గాకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాదర్ సమర్పించారు. ఈ క్రాయక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి,ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ఫహీం ఖురేషీ, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముస్లిం మైనారిటీ నేతలు హాజరయ్యారు..

# ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరని అన్నారు. ఉద్యోగ నియామకాల జాప్యం యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని.. ముందస్తు ప్రణాళికతోనే వారిలో విశ్వాసం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణ పీఎస్సీ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తోందని చెప్తూ కమిషన్ ఛైర్మన్, సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభినందించారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని.. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి తుది ఎంపిక వరకూ ప్రతి దశ స్పష్టంగా ఉండాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు ప్రజాసేవ విలువలకు విరుద్ధమని.. వాటిని కట్టడి చేసేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు, నైతిక శిక్షణ అవసరమని సూచించారు. రిజర్వేషన్లు సంఖ్యలకే కాదని, వాస్తవిక ఫలితాలు ఇవ్వాలంటూ డిప్యూటీ సీఎం భట్టి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం హాజరయ్యారు.

# హైదరాబాద్ చేరుకున్న ఉపరాష్ట్రపతి

(మొదటి పేజీ తరువాయి)

సర్వీస్ కమిషనర్ల ముగింపు సదస్సులో ఉప రాష్ట్రపతి పాల్గొనున్నారు. మరోవైపు శీతాకాల విడిది కోసం వచ్చిన రాష్ట్రపతి.. రామోజీ ఫిల్మ్‌సిటీలో జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈరోజు గచ్చిబౌలిలో బ్రహ్మ కుమారిస్ శాంతి సర్వోవర్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క రాష్ట్రపతి ముర్ముకి ఘనస్వాగతం పలికారు. బ్రహ్మ కుమారిస్ 21వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటారు. కాగా, రెండ్రోజుల పర్యటన సందర్భంగా నేడు హైదరాబాద్‌కు చేరుకున్న ఉపరాష్ట్రపతి.. నేరుగా రామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్లనున్నారు. అక్కడ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్‌పర్సన్ల సమావేశ ముగింపు సెషన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. ఈ కార్యక్రమం రాజ్‌భవన్‌కి వెళ్లి రాత్రికి అక్కడే బస చేయనున్నారు. ఆదివారం ఉదయం శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కన్హా శాంతి వనంలో నిర్వహించే వరల్డ్ మెడిటేషన్ డే కార్యక్రమానికి ఆయన హాజరవుతారు. అనంతరం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నేరుగా ఢిల్లీకి బయలుదేరుతారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటనల నేపథ్యంలో తెలంగాణ, హైదరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## కళాశాల విద్యార్థులకు యూనిఫామ్ లు అందజేసిన ఎస్ ఐ పుష్పాల రామారావు




చర్చ: వైరా :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి గ్రామానికి చెందిన తమ తల్లిదండ్రులైన కీ. శే పుష్పాల జగన్నాథం బి ఇందిరమ్మల జ్ఞాపకార్థం వైరా ఎస్ ఐ పుష్పాల రామారావు మరియు కుటుంభ సభ్యులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు యూనిఫామ్ లు( ఏకరూప దుస్తులు) ఉచితముగా అందించారు... వైరా ప్రభుత్వజూనియర్ కళాశాల లో ప్రథమ, ద్వితీయ సంవత్సరము చదువుతున్న 70 మంది నిరుపేద విద్యార్థులకు 50 వేలతో ఏకరూప దుస్తులు ( యూనిఫామ్ ) కొని వారికి అందచేశారు..ఈ సందర్భంగా ఎస్ ఐ పి రామారావు మాట్లాడుతూ ప్రిన్సిపాల్ నవీన జ్యోతి తమ కళాశాల విద్యా ర్థులకు యూనిఫామ్ లు కావాలని విజ్ఞప్తి చేయగా మా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అనేక సేవ కార్యక్రమాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలములో నిర్వహిస్తు న్నామని అందులో భాగముగా ఈరోజు వైరా లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు యూనిఫామ్ లు తమ కుటుంభ సభ్యుల ఆధ్వర్యములో అందించామని, ప్రభుత్వ, పాఠశాలలో, కళాశాలలో చదివే నిరుపేద కుటుంబాల విద్యార్థులకు ఎల్లప్పుడూ తమ కుటుంబము అండగా ఉంటుం దని విద్యార్థులు కష్టపడి చదివి మంచిపేరు తీసుకు రావాలని కోరారు. ఈ సందర్భముగా తాము అడిగిన వెంటనే పేద విద్యార్థులకు యూనిఫామ్ లు అందించిన వైరా ఎస్ ఐ పుష్పాల రామారావు కు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవీన జ్యోతి అధ్యాపకులు, విద్యార్థులు, పేరెంట్స్ కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ లో కొనసాగుతున్న చేరికల వెల్లువ



చర్చ:- మానకొండూర్ :మానకొండూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి సర్పంచుల్లో చాలా మంది కాంగ్రెస్ పార్టీ చేరేందుకు క్యూ కడుతున్నారు. రోజురోజూ చేరికల వెల్లువ కొనసాగుతున్నది. బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన సర్పంచులు కొందరు ఇప్పటికే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా, స్వతంత్రంగా పోటీ చేసి గెలుపొందిన సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. అందులో భాగంగానే శనివారం బెజ్జంకి మండలం బేగంపేట గ్రామ సర్పంచు ఏల విజయ-శ్రీనివాస్,ఉప సర్పంచ్ మధు, శంకరపట్నం మండలం ముత్తారం సర్పంచు మారవేణి రాజయ్య, తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామ సర్పంచ్ ఆసోద శ్రీనివాస్, మానకొండూర్ మండలం శ్రీనివాస్ నగర్ గ్రామ ఉప సర్పంచ్ మహేందర్ రెడ్డితోపాటు అనేక గ్రామాల వార్డు సభ్యులు గుంటుక అంజలి, మంద వికాస్, కొలిపాక రజిత, మంద కుమార్ తదితరులకు ఎల్ఎండీ కాలనీలోని ప్రజా భవన్ లో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.అలాగే ఇల్లంతకుంట మండలం అనంతారం, ఒబులాపురం, బెజ్జంకి మండలం తోటపల్లి, మానకొండూర్ మండలం గంగిపల్లి, కొండపలకల గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, గన్నేరువరం మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు ఊట్కూరి వెంకట రమణారెడ్డి, శ్రీగిర రంగారావు, గోపు మల్లారెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, పోలు రాము, రమేష్, తిరుపతిరెడ్డి, రాములు యాదవ్, వినోద్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ పి.రాజశేఖర్, శీలం నర్సయ్య, బుర్ర తిరుపతి, జనగం శంకర్, పిట్టల అంజయ్య, వరుణ్, రాజమహేందర్, అజయ్,లక్ష్మణ్,కొరిమి మల్లయ్య, కనకయ్య, బుర్ర అంజయ్య, నూనె రాజేందర్,ఇజిగిరి రాజమౌళి, కె.రామచంద్రయ్య, పంజాల రాజవీరు, కనకం రవీందర్, సుద్దాల రాజేందర్, పల్లె మహేష్, ఇజిగిరి శ్రీనివాస్, ఎం.సంతు, గాలి మల్లయ్య, మారవేణి కృష్ణ, మంద రామయ్య, మారవేణి శ్రీకాంత్, కనకం కుమార్, నాగిశెట్టి రాజయ్య, దూలం వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



# ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల



- గేట్లు ఎత్తిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి




చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- బెజ్జంకి,ఇల్లంతకుంట మండలాల్లో సాగులో ఉన్న పంట భూములు దెబ్బతినకుండా సకాలంలో కాలువల ద్వారా నీరందిస్తున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఇల్లంతకుంట మండలం అంతగిరి వద్ద అన్నపూర్ణ ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా నీరందించేందుకు ఎస్సారెస్పీ అధికారులతో కలిసి నీటిని విడుదల చేశారు. కందికట్కూర్ వల్లంపట్ల గ్రామాల మధ్యగల మిడ్ మానేరు జలాశయం నీటిని కాలువలకు విడుదల చేశారు. అన్నపూర్ణ ప్రాజెక్టు నుంచి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం వల్ల సాగులో ఉన్న 15వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని ఎమ్మెల్యే సత్యనారాయణ అన్నారు. అలాగే మిడ్ మానేరు నుంచి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం వల్ల ఆ మండలాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. ముందుగానే నీరు విడుదల చేయడం వల్ల రైతులు వరినాట్లు వేసుకున్న రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. మిడ్ మానేరు నుంచి విడుదలైన నీరు గన్నేరువరం, ఇల్లంతకుంట మండలాల మీదుగా గౌరవెల్లి చేరుతుందని తెలిపారు. ప్రస్తుతమున్న ఆయకట్టు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

**పర్యాటక కేంద్రంగా అంతగిరి అభివృద్ధి**

రాబోయే రోజుల్లో అంతగిరి(అన్నపూర్ణ ప్రాజెక్ట్ )ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వెల్లడించారు. పర్యాటక కేంద్రంగా అంతగిరిని అభివృద్ధిపర్చాలనే ఈ ప్రాంత వాసుల కోరికను నెరవేర్చే దిశగా ప్రభుత్వం దృష్టికి, పర్యాటకశాఖ మంత్రి జూపెల్లి కృష్ణారావు దృష్టికి తీసుకు వెళతానన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్ఈ, ఈఈ, డీఈలతోపాటు ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె అయిలయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్ రెడ్డి, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదింట్లో మెరిసిన ఆణిముత్యం

- ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఆటో డ్రైవర్ బిడ్డ



చర్చ : వైరా :చదువుకు పేదరికం అడ్డు కాదని ఖమ్మం జిల్లా వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన యువతి మాగంటి సుమతి నిరూపించింది.ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైంది. ఖమ్మం జిల్లా వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన మాగంటి బలరాం,సులోచన దంపతులు తండ్రి ఆటో డ్రైవర్ గా తరలి వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు.వీరికి కుమార్తె కుమారుడు ఉన్నారు.కుమార్తె మాగంటి సుమతి స్వగ్రామైన వల్లాపురం ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి ఏడు వరకు,ఎనిమిది నుంచి పది వరకు మండల పరిధిలోని పాలడుగు జడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యనభ్యసించారు.కుమార్తె సుమతి చదువు పట్ల మక్కువ చూపించడంతో తల్లిదండ్రులు కష్టపడి ఆమెను ప్రోత్సహించారు. బాసర ట్రిబుల్ ఐటీలో ఇంటర్ బీటెక్ పూర్తి చేసిన సుమతి టీజీపీఎస్సీ పై మాకుసుమతి టీజీపీఎస్సీ పై మక్కువ చూపించింది. ఎటువంటి కోచింగ్ సెంటర్లకు వెళ్ళకుండా ఇంటి దగ్గరే చదువుకుంటూ. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన టీజీపీఎస్సీ గ్రూప్ 3 ఉద్యోగ నియామక పరీక్షకు హాజరై రాష్ట్రస్థాయిలో 3127 వ ర్యాంక్ సాధించి, మల్టీ జోన్ ఫోర్ లో 8వ ర్యాంకు, ఎస్సీ కేటగిరి లో 57వ ర్యాంక్ సాధించి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18న విడుదల చేసిన గ్రూప్ 3 పరీక్షల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికైంది. నిరుపేద కుటుంబంలో జన్మించి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.తక్కువ వయసులో ప్రభుత్వ ఉద్యోగం సాధించినందుకు స్థానికులు పలువురు ప్రముఖులు గ్రామ సర్పంచ్ మన్నెం హనుమంతరావు,వేమూరి పుల్లారావు లు హర్షం వ్యక్తం చేశారు. చదువులో ఉన్నత స్థాయికి ఎదగాలని పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించానని, తన చదువుకు అమ్మ నాన్న లే ప్రోత్సహించారని, భవిష్యత్తులో ఐఏఎస్ లక్ష్యంగా పెట్టుకున్నానని కలెక్టర్గా పలువురికి సేవలందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆమె తెలిపారు. తండ్రి బలరాం మాట్లాడుతూ ఇద్దరు పిల్లల్ని మనోధైర్యం కోల్పోకుండా ఉన్నత విద్య కోసం కష్టపడి చదివించానని, కుమార్తె సుమతి చిన్నతనం నుండి చదువులో మంచి ర్యాంకులు సాధించిందని ఆమె పట్టుదల చూసి ఉన్నత విద్య చదివించేందుకు సహాయం చేశామని, తన కుమార్తె కలెక్టర్గా చూడడమే తన ఆశని తెలిపారు.

## ఇసుక ర్యాంపును ప్రారంభించిన తహసీల్దార్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్చ పాల్వంచ :ఇందుములముగా పాల్వంచ మండల ప్రజలకు తెలియచేయునది ఏమనగా, జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం ప్రజలకు అందుబాటులో ఇసుక ఇంటివద్దకు సరఫరా చేయుటకు ప్రతిష్టాత్మకముగా మన ఇసుక వాహనం మొబైల్ యాప్ ను ప్రవేశ పెట్టడం జరిగింది. ఇట్టి యాప్ నందు బుకింగ్ చేయుట ద్వారా ప్రజలకు ఇసుక వారి ఇంటి వద్దకే వస్తుంది. ఈరోజు దంతేలబోర %వాజ% కాలనీ గ్రామపంచాయితీ పరిదిలో ఇసుకర్యాంపు ను తహశిల్దారు శ్రీ దారా ప్రసాద్ ప్రారంబించి మండల ప్రజలు సద్వినియోగము చేసుకోవాలని తెలిపినారు అదేవిదముగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారుద

## రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మానేరు విద్యార్థి ఎంపిక





చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనున్న 69వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-14 బాల బాలికల జూడో చాంపియన్ షిప్ పోటీలకు కరీంనగర్ లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థిని ఎంపికైనట్లు విద్యాసంస్థల పిఈటి సిలివేరి మహేందర్ తెలిపారు. ఈనెల 18న కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో 23 కేజీల లోపు బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన బండారి జాహ్నవి అద్వితీయ ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జాహ్నవిని విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించి, బంగారు పతకాన్ని కైవసం చేసుకొని, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని సూచించారు. విద్యార్థిని మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపల్ సరితా రెడ్డితో పాటు పిఈటిలు మహేందర్, జహీదా, తిరుపతి, స్వామి, ఉపాధ్యాయులు విద్యార్థులు, అభినందించారు.

## సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలి



చర్చ:- హుస్నాబాద్ :గ్రామ పంచాయితీలలో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. బీఎస్పీ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి,, పచ్చిమట్ల రవీందర్ గౌడ్. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 12,760 గ్రామపంచాయతీలు ఉన్నాయి . కేంద్ర ప్రభుత్వం 2025 -26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర బడ్జెట్లో కేవలం 1500 కోట్లు రూపాయలు కేటాయించడం జరిగింది. ఈ నిధుల కేటాయింపుతో ప్రతి గ్రామ పంచాయతీకి సంవత్సరానికి 10 లక్షల రూపాయల నిధులు వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతికి, రైతుల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తుంది కానీ గ్రామ పంచాయతీల వీధి దీపాలకు, తాగునీటి పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు అందివ్వలేని పరిస్థితి రాష్ట్రంలో చూస్తున్నము. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి గ్రామపంచాయతీల వీధి దీపాలకు యూనిటీకు 7,రూపాయల 10 పైసలు, తాగునీటి వ్యవసాయ పంపులకు 6, రూపాయల చార్జీలు వసూలు చేస్తున్నారు. వాణిజ్య రంగంలో వసూలు చేసినట్లే గ్రామపంచాయతీ వద్ద కరెంట్ బిల్లులు వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో కరెంటు బిల్లులు కట్టలేక గ్రామపంచాయతీ వ్యవస్థ ఇబ్బందులు పడుతున్నాయి.చిన్న, పెద్ద గ్రామ పంచాయతీలకు నెలకు 50-100 కిలోవాట్ల విద్యుత్ అవసరం ఉంటుంది. రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలకు సోలార్ విద్యుత్ ప్లాంట్ లు అందజేస్తే గ్రామపంచాయతీలు ఆర్థికంగా కోలుకుంటాయి. అరకొర నిధులతో పారిశుద్ధ్యం, కార్మికుల వేతనాలు చెల్లించడంలో కూడా తీవ్ర ఇబ్బందులు చూస్తున్నము. ఇట్టి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన చేసి గ్రామపంచాయతీలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లను అమర్చి ఆదుకోవాలని బి.ఎస్.పి పార్టీ పక్షాన పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ కోరారు.

## సిపిఐ లో చేరిన కోడిపుంజుల వాగు సర్పంచ్ మహేశ్వరి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్చ పాల్వంచ : కోడిపుంజుల వాగు నూతన సర్పంచ్ అజ్మీర మహేశ్వరి శ్రీనివాస్ శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) లో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబ శివ రావు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సిపిఐ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తాజాగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన కోడిపుంజుల వాగు సర్పంచ్ మహేశ్వరి సిపిఐ లో చేరారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామపంచాయతీ పాలన ముందుకు సాగాలని, రాగద్వేషాలకు తావు లేకుండా పారదర్శకతతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పేదల పక్షాన అనునిత్యం పోరాడే సిపిఐ కుటుంబం లోకి రావడం అభినందనీయం అనీ, ప్రజల పక్షాన చేపట్టే ప్రతి మంచి కార్యక్రమం వెనుక సిపిఐ అండదండలు ఉంటాయని అన్నా రు.మహేశ్వరి చేరికతో స్థానిక సంస్థల్లో మరింత బలం పెరిగిందని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ భాష, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీశం శెట్టి పూర్ణచంద్రరావు, గుండాల నాగరాజు. మన్యం వెంకన్న అజ్మీర రాములు నాయక్, అజ్మీర శ్రీనివాస నాయక్ బాదావత్ వెంకటరామ్, బాదా వత్ రాములు బాదా వత్ రాంజీ, గూగులోత్ రాములు, బాదావత్ లక్పతి, బానోత్ చందు అజ్మీరా బాలు, అజ్మీర కృష్ణ, తేజవత్ రమేష్. లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక




## జాతీయ పురస్కారాలకు దరఖాస్తు ఆహ్వానం



**చర్చ:- హుస్నాబాద్:** తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ మరియు కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద మరియు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు జనవరి. 12. 2026 నుండి జనవరి. 23. 2026 జరుగును ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొనిస్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కా రం,నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, స్పోర్ట్స్ ఇండ ియన్ ఐకాన్ పురస్కారం,యూత్ ఇండియన్ ఐకాన్ పురస్కారం,ఉమెన్ ఇండియన్ ఐకాన్ పురస్కారం,భారత స్ఫూర్తికిరిటీ పురస్కారం, నటరాజ పురస్కారం, మహానంది పురస్కారాలకు ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ. కర్ణాటక ,తమిళనాడు. ఒరిస్సా,మహారాష్ట్ర, మరియు పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థచైర్మన్ పోలోజు రాజ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ కార్య నిర్వహణ కమిటీచైర్మన్, డాక్టర్ వలబోజు మోహన్ రావు కన్వీనర్, పొన్నెకంటి శ్రీనివాసాచారి కోఆర్డినేటర్, డాక్టర్ వేముల తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు ఈవెంట్ ఆర్గనైజర్స్, ఈవెంట్ మేనేజర్, డాన్స్ మాస్టర్లు, యాంకర్లు ,సాహిత్యం, రచన,కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం, భరతనాట్యం, కూచిపూడి, కోలాటం, చిత్రలేఖనం,శిల్పి, నాటకం, జానపదం, మిమిక్రీ ,అవధానం, విద్య ,వైద్య ,ఇంద్రజాలం,ముఖాభినయం, హరికథ ,ఒగ్గు కథ, బుర్రకథ,రంగస్థలం కళాకారులు,వాస్తు, జ్యోతిష్యం, భక్తి, పురోహితం,యోగా, క్రీడా,సామాజిక సేవా, షార్ట్ ఫిలిం, పర్యావరణ పరిరక్షణ,సైన్స్ అండ్ టెక్నాలజీ,డోలక్, హార్మోనియం,భజన కళా ,వ్యవసాయం, కరాటే,మ్యాజిక్. టీవీ నాటక కళాకారులు, వాయిద్య కళాకారులు, యువజన మహిళా సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థులు, గ్రామీణ అభివృద్ధి వివిధ రంగాలలో పనిచేస్తున్న ప్రతిభవంతులైన వారు పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలిపారు.

## రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్






**చర్చ కొత్తగూడెం :** భారత రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యత కేవలం న్యాయస్థానాలకు,న్యాయవాదులకు మాత్రమే కాకుండా ప్రతీ ఒక్క పౌరునిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ స్పష్టం చేశారు. సమసమాజ స్థాపన, సమానత్వం, సామాజిక న్యాయం అనే లక్ష్యాలతో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగ విలువలను కాపాడుకోవడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో ఐ.ఎల్.పీ.ఏ జాతీయ అధ్యక్షురాలు కె.సుజాత చౌదంతి అధ్యక్షతన నిర్వహించిన ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.పీ.ఏ) తెలంగాణ రాష్ట్ర ఐదవ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కేవలం చట్టాల సమాహారం మాత్రమే కాకుండా, దేశ ప్రజల జీవన విధానాన్ని దిశానిర్దేశం చేసే మహత్తర గ్రంథమని అన్నారు. సమాన హక్కులు, మానవగౌరవం, స్వేచ్ఛ, సోదరభావం వంటి విలువలను ప్రజలందరికీ అందించాలనే సంకల్పంతో రాజ్యాంగం రచించబడిందని వివరించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన మౌలిక హక్కులు, దిశానిర్దేశక సూత్రాలు సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పునాదులుగా నిలుస్తున్నాయని, వాటిని కాపాడే బాధ్యత న్యాయవ్యవస్థతో పాటు సమాజంలోని ప్రతీ ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా న్యాయవాదులు రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.నేటి కాలంలో రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉందని, ఈ దిశగా ఇటువంటి రాష్ట్ర స్థాయి మహాసభలు న్యాయవాదుల మధ్య చర్చకు, ఆలోచనలకు, మార్గదర్శకత్వానికి దోహదపడతాయని జిల్లా జడ్జి తెలిపారు. న్యాయవృత్తిలో నైతిక విలువలు,సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ఈ తరహా సదస్సులు ఉపయోగపడతాయని అన్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు రాజ్యాంగం, న్యాయస్థానాల విధులు,చట్టాల పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో న్యాయవాదులు గ్రామస్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరముందని సూచించారు. అలా చేసినప్పుడే నిజమైన న్యాయసమాజం ఆవిర్భవిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచిన ఐ.ఎల్.పీ.ఏ తెలంగాణ యూనిట్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ, న్యాయవాదుల హక్కులు, సమస్యలు, భవిష్య త్తును దృష్టిలో పెట్టుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా ఐ.ఎల్.పీ.ఏ మరిన్ని సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపట్టి న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపంచాలని ఆకాంక్షించారు.

ఈకార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సరిత, న్యాయమూర్తులు కిరణ్ కుమార్ కవిత, రాజేందర్, సుచరిత, రవికుమార్, వినయ్ కుమార్, సూరెడ్డి, లక్కినేని సత్యనారాయణ ఐ. ఎల్.పీ.ఏ తెలంగాణ బాధ్యులు శాంసన్, దేవరాజ్ గౌడ్, లక్ష్మీ దేవి, సైనీ నాగేందర్, అదనం కామర్ తదితరులు పాల్గొన్నారు

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు : భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్



- భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజు పేట,జగదీశ్ కాలనీల్లో భద్రాచలం పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో శనివారం భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజుపేట,జగదీశ్ కాలనీల్లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం ను నిర్వహించారు.ఇందులో భాగంగా మొత్తం సుమారుగా 300 ఇండ్లలో సోదాలు నిర్వహించి సరిగా పత్రాలు లేకుండా నెంబర్ ప్లేట్లు లేని 66 ద్విచక్ర వాహనాలను,05 ఆటోలను,ఒక ట్రాలీను సీజ్ చేయడం జరిగింది.అంాకుండా 85 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాదీనం చేసుకుని,సంభంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.అనంతరం కాలనీ వాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఏఎస్పీ విక్రాంత్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మట్కా, జూదం,కోడిపందాలు, బెట్టింగ్,గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదన్నారు.అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు.విపత్కర సమయాల్లో ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను పొందాలని సూచిచారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాని తెలిపారు. నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాలలో సీసి కెమెరాలను ఏర్పాటు చేసు కోవాలని సూచించారు.

సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు మరియు సిబ్బ ంది పాల్గొన్నారు. భద్రాచలం ఇన్స్పెక్టర్ నాగ రాజు, ఎస్సైలు తిరుపతి, స్వప్న, సతీష్, శ్యామ్, సీఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉండ్రుశ్యాంబాబు వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

- ఏసుక్రీస్తు జననం ఈ విశ్వానికి శాంతి మార్గం
- ఏసు బోధనలు ప్రతి ఒక్కరు ఆచరించాలి: డాక్టర్ కాపా మురళీకృష్ణ , నూతి సత్యనారాయణ





**చర్చ: వైరా :** వైరాలో లయన్స్ క్లబ్ మరియు గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం లయన్స్ కంటి హాస్పటల్ నందు ఉండ్రు శ్యాంబాబు వరలక్ష్మి దంపతులు సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ విచ్చేసి వారు మాట్లాడుతూ యేసు క్రీస్తు జననం ఈ విశ్వానికి శాంతి మార్గమని శత్రువుని సైతం ప్రేమించమని చెప్పిన యేసు బోధనలు ప్రతి ఒక్కరు ఆచరించారని కుల మతాలకు అతీతంగా అందరూ జరుపుకునే పండుగ కిస్మస్ అని ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా చేసుకునే ఈ పండుగ ప్రేమా శాంతి సోదర భావం పెంపొందిలా జరుపుకోవాలని అన్నారు ప్రపంచం లోనిక్రైస్తవులందరూ క్రిస్మస్ కోసం ఎదురుచూస్తున్న రోజులివి కాంతిని ఆరాధించడమే క్రిస్మస్ బైబిల్ ప్రకారం విశ్వంలో మొదటి జన్మించినది కాంతి ఆ కాంతిని నేనే అని క్రీస్తు ప్రకటించాడని వారు తెలిపారు మనిషిని మనిషి ప్రేమించాలి కరుణతో ప్రవర్తించాలని త్యాగబుద్ధితో నడవాలని మానవతతో మెలగాలని ఆయన ప్రబోధించాడని తెలిపారు మానవులకు ఏది చేయాలని బోధించాడు దాన్ని ఆచరించాడని చివరికి సాధారణంగానే మరణించాడని వారు తెలిపారు పండుగ కాంతులు జీవితంలో నిండాలంటే మనలో క్రీస్తును నింపుకోవాలని వారన్నారు. ఈ సందర్భంగా ఉండ్రు శ్యాంబాబు వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో 150 మంది పేద వృద్ధులకు వితంతువులకు దుప్పట్లను పంపిణీ చేశారు నిరుపేద మహిళకు కుట్టుమిషన్ అందించారు తొలుత ఫాస్టర్ రెవరెండ్ వివిఎన్ లాజరస్ యపప్రాస్ పాస్టరేట్ చైర్మన్ సివిస్ఐ సెయింట్ జాన్స్ చర్చి నిర్వాహకులు బోధన చేసి కేక్ కట్ చేసి అందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు వైరా లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఏడు నూతల బుచ్చి రామారావు గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు జాల పుల్లారావు క్లబ్బుల సెక్రటరీలు కోశాధికారులు చెరుకూరి శ్రీనివాసరావు గంగవరపు కిషన్ ఉయ్యూరి రామకృష్ణ గద్దె నీరజ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు ఐదో వార్డ్ మాజీ కౌన్సిలర్ శ్రీమతి మాదినేని సునీత జాల మహాలక్ష్మి మరికంటి రాంగోపాల్

జిల్లా కమిటీ సభ్యులు తోట కూ ర శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరంశెట్టి సీతా రా ము లు రంగా జనార్ధన్ రావు గుమ్మ రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేరళ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ఎస్ ఎల్ సి నిర్వహణ



**చర్చ:- హుస్నాబాద్: పట్టణంలో :** స్థానిక కేరళ ఇ/మీ హైస్కూల్లో ఘనంగాకార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్ మాట్లాడుతూ ఈరోజు ఎస్ఎల్సీలో భాగంగా 155 పైగా ప్రాజెక్ట్ లను ప్రదర్శించడం జరిగిందని, ఈ కార్యక్రమంలో నర్సరీ నుండి టెన్త్ క్లాస్ వరకు విద్యార్థులు పాల్గొన్నారని తెలియజేశారు. ఈ ప్రదర్శనలో సోలార్ సిస్టం, , పొల్యూషన్ అరికట్టడం, మ్యాజికల్ స్క్వేర్స్, పీడియాట్రిక్ టేబుల్, ఎర్త్ లేయర్స్, మ్యాస్ ఎగ్స్ బిట్స్, డయాలసిస్ మిషన్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, తెలుగు లాంగ్వేజ్లకు సంబంధించిన గ్రామర్ లను ప్రదర్శించడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్, సెక్రటరీ కరస్పాండెంట్ అల్లి శైలేందర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుష్ఠ వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమ సర్వేను పరిశీలించిన డాక్టర్ తుకారం రాథోడ్

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, జిల్లా అధికారుల సముదాయం నవభారత్ పాల్వంచ






**చర్చ, పాల్వంచ :** డాక్టర్ తుకారాం రాథోడ్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి జగన్నాధపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిది లోని ఇందిరా నగర్ ఉపఆరోగ్య కేంద్రం వికలాంగుల కాలనీ నందు కుష్ఠ వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం నందు జరుగుతున్న సర్వే ను పరిశీలించారు. శనివారం వరకు జిల్లాలో 1, 407మంది ఆశాలు పాల్గొనగా, 89,545 ఇండ్లను సందర్శించి 3,11,165 మందిని పరీక్షించి 733మంది అనుమానితులను గుర్తించారు. వారిలో 254 మందిని పరీక్షలు చేయగా కుష్ఠ వ్యాధి లేదని తెలియజేసారు. తరువాత కొత్తగూడెం ధర్మల్ కేంద్రం పాల్వంచ నందు జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్ జ ఆధ్వర్యంలో సిపిఆర్ (కార్డీఓ పల్మనరీ రెసుసైటేషన్)సిపిఆర్ చేసే విధానం (పెద్దల కోసం అడల్ట్ సిపిఆర్) స్టెప్ 1: చెస్ట్ కంప్రెషన్స్ (ఛాతీ ఒత్తిడి) వ్యక్తిని వెనుకకు పడుకోబెట్టాలి.ఛాతీ మధ్య భాగంలో (రెండు నిప్పుల మధ్య)రెండు చేతులు ఒకదానిపై ఒకటి పెట్టాలి. గట్టిగా, వేగంగా నొక్కాలి. వేగం: నిమిషానికి 100120 సార్లు లోతు: సుమారు 56 సెం.మీ.30 సార్లు నొక్కాలి.

స్టెప్ 2: బ్రీతింగ్ (శ్వాస ఇవ్వడం)ముక్కు మూసినోరు నోరుకు పెట్టి2 శ్వాసలు ఇవ్వాలి. శ్వాస ఇవ్వడం రాకపోతే, కేవలం ఛాతీ ఒత్తిడి (హాండ్స్ ఓన్లీ సిపిఆర్) కూడా సరిపోతుంది.

స్టెప్ 3: 30 : 2 విధానం30 ఛాతీ ఒత్తిళ్లు2 శ్వాసలుఇలా అంబులెన్స్ వచ్చే వరకు లేదా వ్యక్తి స్పందించే వరకు కొనసాగించాలి. పిల్లలు / శిశువులకు (సంక్షిప్తంగా)

ఒక చేతితో లేదా రెండు వేళ్లతో ఒత్తిడి తక్కువ లోతుగా చేయాలి. శ్వాసలు మృదువుగా ఇవ్వాలి సిపిఆర్ చేయకూడని పరిస్థితులు వ్యక్తి సాధారణంగా శ్వాస తీసుకుంటుంటే స్పష్టమైన మరణ లక్షణాలు ఉంటే ముఖ్యమైన సూచనలుసిపిఆర్ ఆలస్యం చేయకూడదు.తప్పుగా చేసినా చేయకపోవడం కన్నా చేయడం మేలుసరైన శిక్షణ ఉంటే మరింత మంచిది అని అవగాహన కల్పించారు.ఫుడ్ సేఫ్టీ ధ్రువీకరణ పత్రాలు కూడా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం నందు, డా బానోత్ ప్రసాద్, డా మధువరుణ్ డీపీఎంఓ మోహన్ కేటీపీస్ రక్షణ దళం మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల భాగస్వాములు కావాలి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా పర్యాటక రంగం అభివృద్ధిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు భాగస్వాములు కావాలి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసే బాధ్యతను సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు స్వీకరించి, యువతలో చైతన్యం కలిగించే విధంగా భాగస్వాములుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు.శనివారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పర్యాటక రంగ అభివృద్ధి, ముక్కోటి సందర్భంగా నిర్వహించనున్న ఏరు రివర్ ఫెస్టివల్ను విజయవంతం చేయడానికి చేపట్టవలసిన చర్యలపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రకృతి సౌందర్యం, ఆధ్యాత్మికత, గిరిజన సంస్కృతి సమ్మేళనంగా ఉన్న జిల్లాగా గుర్తింపు పొందిందని అన్నారు. జిల్లాలోని పగిడేరు వేడి నీళ్లు, గోదావరి నది పరివాహక ప్రాంతాలు, కనిగిరి గుట్టలు, కిన్నెరసాని అడవీ ప్రాంతాలు వంటి అనేక విశిష్టమైన పర్యాటక కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతాలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పర్యాటక పటంలో స్థిరపరచడానికి విస్తృత స్థాయి ప్రచారం అత్యవసరమని అన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూర్చవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పర్యాటకుల రాక పెరిగితే హోటళ్లు, రవాణా, హస్తకళలు, స్థానిక వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను ఎకో టూరిజం హబ్‌లుగా అభివృద్ధి చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని వివరించారు. పర్యాటక రంగంలో సోషల్ మీడియా పాత్ర కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను వీడియోలు, ఫోటోలు, కథనాల రూపంలో డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు చేరవేస్తే జిల్లాకు విశేష గుర్తింపు లభిస్తుందని అన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని సానుకూల సందేశాలతో జిల్లాను ప్రమోట్ చేయాలని సూచించారు.ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఏరు రివర్ ఫెస్టివల్ను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా22వ తేదీన బెండలపాడు లోని కనిగిరి గుట్టల ట్రెక్కింగ్,23వ తేదీన కిన్నెరసాని రివర్ వాక్ ముత్తాపురం నుండి మొతలగూడెం బ్రిడ్జి వరకు సుమారు మూడున్నర కిలోమీటర్ల వాకింగ్ కార్యక్రమం,24వ తేదీన పాల్వంచలోని శ్రీనివాస్ గిరి గుట్ట ట్రెక్కింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా 26వ తేదీన దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్పలో సాయంత్రం 4.30 గంటలకు ట్రైబల్ ఈవినింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యాలు, సంస్కృతి, జీవన విధానాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. 27వ తేదీన భద్రాచలం గోదావరి



నది ఒడ్డున సాంస్కృతిక కార్యక్రమాలు, ఆసక్తి గల యువత ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని తెలిపారు. 28వ తేదీన గోదావరి నది ఒడ్డున సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు, 29వ తేదీన పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, 30వ తేదీన వైకుంఠ ద్వార దర్శనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.పర్యాటకుల సౌకర్యార్థం గోదావరి నది ఒడ్డున క్యాంపులు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలన్నింటిలో ఆసక్తి గల యువత, పర్యాటకులు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు జిల్లాలో జరుగుతున్న పర్యాటక, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంలో భాగస్వాములై, విస్తృత స్థాయిలో ప్రజలకు చేరవేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. యువతను చైతన్యపరచే విధంగా సానుకూల దృక్పథంతో కార్యక్రమాలను ప్రచారం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాల్గొన్నారు.

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
డిసెంబర్ 21, 2025


# ధనమే ప్రధానమా కాదు

ఇటీవలే ధనం గూర్చి ఒక వ్యాసాన్ని రాశాను. ఇది దానికి కొనసాగింపు.... నేటి రోజుల్లో అన్ని డబ్బు చుట్టే తిరుగుతున్నాయి. మనీ, మనీ, మనీ, మనీ మేక్స్ మెనీ థింగ్స్? వాస్తవానికి డబ్బే వ్యవస్థల చుట్టూ తిరగాలి. మన శరీరంలో ప్రతి కణానికి, భాగానికి కరెక్టుగా రక్తం అందించబడితేనే శరీరం ఆరోగ్యకరంగా ఉంటుంది. అలాగే సమాజంలోనూ ధనం ప్రవహించాలి. అయితే అది ఏ ఒక్కరి వద్దో లేదా కేవలం కొందరి వద్దో నిల్వ ఉంటే సమాజాభివృద్ధి గమనించబడదు.
బ్రతకడానికి డబ్బు అవసరమే కానీ కేవలం డబ్బు కోసమే జీవించడమనేది కరెక్ట్ కాదు. ధనాపేక్ష సహజమే కావచ్చు. కాని హద్దు మీరిన అతి విపరీతమైన ధనాపేక్ష పాపాలను చేయిస్తూ దారి మళ్లిస్తుంది. కొన్నిసార్లు బీదలను కష్టపెట్టడం, బాధ పెట్టడం లాంటి వాటికి డబ్బే దారి తీస్తుంది. బీదలను ఇబ్బందులకు గురి చేయడం అనేది మానవత్వానికి మచ్చ. అందుకే "దురాశ దుఃఖానికి చేటు" గా ఏనాడో చెప్పబడింది. దురాశ అనేది దుర్మార్గం కూడా! దురాశ అంటే అన్నింటినీ, ఇతరులవీ ఆశించడమే దురాశ అవుతుంది. ఎంత సంపద ఉన్నా... అది ఆత్మను ఏమాత్రం రక్షించలేదనేది వాస్తవం. కావున ఇహలోక ధనం, సంపద గురించి చింతించకుండా కడు బీదల గూర్చి ఆలోచించడం ధన్యకరం. కడు బీదలకు సహాయం చేసేవారు నిజంగా దేవతల సమానులు. డబ్బు శాశ్వతం కాదు. కాని గుణం శాశ్వతం. గుణవంతులే దాతలుగా సేవా భావంతో ఉంటారు. దాత కానివాని దఱచుగా వేడిన వాడు దాత యౌనె వసుధలోన ఆరు దర్భయౌనె యబ్దిలో ముంచిన
విశ్వదాభిరామ వినుర వేమ! దీని అర్థం:- అసలు దానము చేయని వారిని అప్పుడప్పుడు దానమడిగితే అతడు దాత అవుతాడా? అరిక గడ్డిని సముద్రంలో ముంచినను దర్భ అగునా? ఎప్పటికీ కాదు. అందుకే దాన శీలత బహు బలము గలది. ఇది తెలిసిన వారే దాతలు. తమ దాన గుణంతో వారు చేసిన సత్కార్యాలతో చరిత్రలో నిలిచిపోయిన మహానుభావులు ఎందరో... ఉదా:- శిభి చక్రవర్తి, కర్ణుడు, ధర్మరాజు ఇలా ఎందరో... అయితే దానశీలత గూర్చి తెలియక డబ్బుతో ఏమైనా చేయ్యొచ్చు,డబ్బుతో ఏమైనా కొనవచ్చు అనుకోవడం అవివేకమే అవుతుంది. కొన్నిసార్లు డబ్బే సమస్యలకు హేతువుగా ఉంటుందనే వాస్తవాన్ని గ్రహించాలి. కేవలం ధనాపేక్షతో చూడకూడని సంఘటనలను, వినలేని విషయాలను చూస్తున్నాం. వింటున్నాం, విచారకరం. కేవలం డబ్బుతో ఏదైనా చెయ్యవచ్చు, కొనవచ్చు అనే అపోహతో ఉంటే... గమనించండి. కొన్నింటిని డబ్బుతో ఏమాత్రం కొనలేము, అది అసాధ్యం కూడా! వాటిలో కొన్నింటిని గూర్చి క్లుప్తంగా... దయచే పరిశీలించండి.
1) ప్రేమ:- పలుకు చిన్న, రెండు అక్షరాలతో ఉండే ఈ పదం ఘనమైన పనితీరును కలిగి ఉంటుంది. అది యదార్థతతో ఉన్నప్పుడే!. ప్రేమ అనేది గుణశీలతలో ముఖ్యమైన అంశం. వ్యక్తిత్వానికీ, వ్యక్తిగత సంబంధాలకు గంభీరమైన నిర్వచనమే ప్రేమ. అన్యాయం, అక్రమం, అవిధేయత, అసూయ, ఉద్రేకం లాంటి వాటికి ప్రేమలో తావేలేదు. నిజమైన ప్రేమ అన్నింటినీ ఓర్చుకుంటూ, అన్నీ సహిస్తుంది. యదార్ధత కూడిన ప్రేమతో చేసే కార్యాలు దేవతల కార్యాలుగా ఉంటాయి. ఉదా:- మదర్ థెరిస్సా. ఈలాంటి దైవాంశ ప్రేమ పూరిత కార్యములను డబ్బుతో కొనగలమా?2) సహనం, ఓర్పు:- విశాలమైన సముద్రం సైతం సహనం ముందు చిన్నదిగానే ఉంటుంది. ఓర్పు సహనం లనేవి విరోధ భావానికీ వ్యతిరేకంగా ఉండే దైవిక లక్షణాలు. సహనం సుగుణం. సహనంతో ఉంటే ఖచ్చితంగా ఫలితం గోచరిస్తుంది. అందుకే, ఓపిక లాభదాయకంగా ఏనాడో చెప్పబడింది. మరి డబ్బుతో సహనాన్ని, ఓపికను కొనగలమా? ఒకవేళ కొనే ప్రయత్నం చేస్తే అది పూర్తి తాత్కాలికమే అవుతుంది. 3) యథార్ధతతో కుడిన స్నేహం:- నిజమైన స్నేహితుడు, ఖచ్చితంగా ఆలోచిస్తూ విడవక అమితంగా ప్రేమిస్తుంటాడు. యదార్థమైన ప్రేమ దేనినీ ఆశించదు, కోరదు. త్యాగానికి సైతం సిద్ధపడుతుంది. మన కష్ట కాలంలోనే మన అసలు స్నేహితులు ఎవరో తెలుస్తారు. నిజమైన స్నేహితుడు ఎలాంటి పరిస్థితుల్లో అయినా, ఏ సమయంలోనైనా వెన్నంటే ఉంటాడు. యదార్థవంతులైన స్నేహితులను గలవారు ధన్యులు. వారు దేవుడిచ్చిన బహుమానాలు. ఇకమరి యదార్థతతో కూడిన స్నేహితులను డబ్బుతో కొనగలమా4) గౌరవం:- వ్యక్తుల వారివారి ప్రత్యేక మూర్తిమత్వ లక్షణాలను అనుసరించి గౌరవం అనేది యాదృచ్ఛికంగా ఇవ్వబడుతుంది. ఒకవేళ డబ్బుతో గౌరవం ఇవ్వబడ్డా, అది కేవలం కాకతాళీయం, తాత్కాలికం, ఆమట్టుకే, ఆపై అభాసుపాలు చేస్తుంది. మహా మహా వ్యక్తులైన గాంధీజీ, వివేకానంద, అబ్రహం లింకన్, బి.ఆర్ అంబేద్కర్ ,నెల్సన్ మండేలా, అల్లూరి సీతారామరాజు లాంటి తదితరులను నేటికీ, ఎప్పటికీ గౌరవిస్తూనే ఉంటాం! వారు ధన్యజీవులు.
5)విశ్వాసం:- దీనినే నమ్మటం అనవచ్చు. ప్రేమ, నిరీక్షణలు నమ్మకంలోని అంతర్భాగాలు. సత్యమునే నమ్ముతూ, పలుకుతూ పాటిస్తూ మాట తప్పని నైజం విశ్వాసానికి ప్రతీకగా ఉంటుంది. నమ్మకంతో నమ్మకాన్ని కలిగిస్తూ జీవించడం అనేది గొప్ప విషయం. నీతిమంతులు చక్కని విశ్వాసాన్ని ప్రదర్శిస్తూ మార్గదర్శకులుగా నిలుస్తారు. ఇక పూర్తి విశ్వాసంతో ఉండే నీతిమంతులను డబ్బుతో కొనగలమా? అసాధ్యం కదా! విశ్వాసమే విజయానికి ప్రతీక గమనించాలి. 6) సత్యం:- ఈ చిన్న పదం గూర్చి ఒక్క వాక్యంలో స్పష్టంగా చెప్పవచ్చు "సత్యమేవ జయతే" సత్యం ఆగదు-దాగదు, చీల్చి చెండాడుతుంది. జ్ఞానం- వివేచనలను కలిగి ఉంటూ దూసుకెళ్తుంది. సత్యం అనేది ఒక వ్యక్తిలోని ప్రత్యేక నైతిక లక్షణాన్ని సూచిస్తుంది. ఎప్పటికీ మార్పు లేకుండా శాశ్వతంగా కలకాలం ఉండిపోయే సత్యం దైవ గుణాలలో ఒకటిగా చెప్పబడింది. సత్యం జయానికే మార్గం చూపు తుంది ఎప్పుడూ! ఉదా:- ఒక నూనె చుక్కను బావిలో, చెరువులో, చివరికి సముద్రంలో వేసినా ఉపరితలంలో తేలుతుంది తప్ప మునిగిపోదు. సత్యమూ అంతే! సత్యం ఎల్లప్పుడూ జయాన్ని అందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుంది. మరి అలాంటి సత్యాన్ని డబ్బుతో కొనగలమా?
7) జ్ఞానం:- జ్ఞానమునకు అవధులు లేవు, సముద్రపు లోతు మరి యు సరిహద్దులను అంచనా వేయవచ్చు కానీ జ్ఞాన సరిహద్దులను, లోతులను ఏమాత్రం అంచనా వేయలేం. జ్ఞాన పరిధి అతి విస్తృతమైనది. జ్ఞానం-వివేకం ఇవి సమానార్థకాలుగా ఉంటాయి. విద్య వలన జ్ఞాన పరిధి విస్తృతమవుతే- వివేకం అనేది కార్యాచరణకు కారణమవుతుంది. జ్ఞానమునకు జ్ఞానమే సాటి మరోటి లేదు. అంతర్దృష్టి, విధేయతల సమ్మేళనమే జ్ఞానానికి మార్గం చూపుతుంది. జ్ఞాన వివేకములున్నా వ్యక్తులే మహాత్ములు, వారున్న సమాజం వర్ధిల్లుతుంది. మరియు శోభిల్లుతుంది. 8) జాలి, దయ:- నిజానికి జాలి, దయ, కనికరం అన్నీ ఒకే కోవకు చెందినట్లే అనిపించినా వాటి ప్రత్యేకతలు వాటి వాటికున్నాయి. ఉదా:- అత్యంత అవసరతలో ఉన్న వ్యక్తిని చూసి జాలి పడటం అంటే అంతో ఇంతో సహాయం చేయడం అలాగే సహాయంతో పాటు ఆ అవసరతను అధిగమించేలా ఆలోచించడం కనికరమవుతుంది. ఇక ఆ అవసరతను పూర్తిగా అధిగమించే మార్గాన్ని అందించడం దయా గుణానికి ప్రతీకగా ఉంటుంది. కడు బీదవారు, అనాధలు, విధవలు, పీడుతులు, ఈలాంటి వారి పట్ల జాలి, దయ కనికరాన్ని చూపాలి. ఇవన్నీ దేవతల గుణాలే. ఇక ఈలాంటి దేవతల గుణాలను డబ్బుతో కొనగలమా? 9) సమయం:- సృష్టిలో కెల్లా తనకంటూ ప్రత్యేకతను కలిగినది సమయం. అన్నీ దీనిముందు దిగదుడుపే, తల వంచాల్సిందే! సమయం అన్నింటికీ అతీతంగా ఉంటూ, సమయానుకూలంగా తన పని తాను చేసుకుపోతుంది. సమయమే అన్నింటినీ సర్దుబాటు చేస్తుంది. ఈ సృష్టిలో అన్నింటికీ సమయమంటూ ఉంది. గమనించాలి. అయితే సమయం సంపూర్ణమైతేనే ఫలితం గోచరిస్తుంది. విజ్ఞులు సమయాన్ని సద్వినియోగం చేస్తారు. అందుకే డబ్బుతో సమయాన్ని కొనలేం! కేవలం గడియారాన్ని కొనగలం కాని గడిచిపోయిన కాలాన్ని ఏమాత్రం కొనలేం కదా!
10) కుటుంబం:- సకల మానవ సమూహాలలో కుటుంబం అనేది అతి ముఖ్యమైన ప్రాథమిక కీలక సంస్థ. తల్లి,తండ్రి వారి పిల్లలు ఒక సమూహంగా ఉంటూ వారి మధ్య సంబంధాలు శాశ్వతంగా ఉంటాయి. స్వచ్ఛమైన యధార్థతో కూడి ఉన్న ప్రేమానురాగాలు, స్వేచ్ఛ, స్వచ్ఛత గల కుటుంబాలను డబ్బుతో కొనలేం!. ఇలా అనేక నైతిక అంశాలను డబ్బు సమకూర్చలేదు. ఇతరుల శ్రేయస్సు కోరుతూ అందరి పట్ల దయను కలిగి ఉంటూ విలువలతో, సుగుణాలతో ఉండే జీవితాలు సదా వర్ధిల్లుత ుంటాయి. అలాంటి జీవితాలు ధన్యమైనవి. అలాంటివారికి నా నమస్సుమాంజలి. అందుకే, మొదట డబ్బు కొనలేని సుగుణాలను, తత్వాలను ఆపాదించుకోవాలి. ఇక కీర్తి వెనువెంటనే వస్తుంది. ఆత్మసంతృప్తి సమృద్ధిగా లభిస్తుంది.



డాక్టర్ ఎం.ప్రభుదయాల్-కొత్తగూడెం
పూర్వ ప్రిన్సిపాల్, గిరిజన విద్య కళాశాల, భద్రాచలం
మాజీ సెనేట్ మెంబర్, కాకతీయ యూనివర్సిటీ- వరంగల్
జీవిత సభ్యుడు- ఐఏటిఈ

# కొంతమంది అధికారులు వల్ల సింగరేణి కీర్తి పటిష్టలు దెబ్బతింటున్నాయి ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య







చర్చ సింగరేణి కొత్తగూడెం : సింగరేణిలో కొంతమంది అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తుండడంతో సింగరేణి సంస్థ కీర్తిపటిష్టలు దెబ్బతింటున్నాయి, రిటైర్డ్ అయిన కార్మికులకి లాభాల వాటా, మరియు పిఎల్ఆర్ బోనస్ అనగా దీపావళి బోనస్ ఇవ్వటానికి క్వాటర్ క్వాలీ చేయాలని నిబంధన ఇదివరకు ఎప్పుడు సింగరేణిలో లేదు , రిటైర్డ్ అయిన కార్మికుడు క్వార్టర్ ఖాళీ చేయకపోతే ఒక గ్రాట్యూటీ మాత్రమే ఇదివరకు ఆపేవారు, కాకపోతే ప్రస్తుతం అధికారులు అనుచరిస్తున్న వ్యవహార శైలి చూస్తే కొత్త నిబంధనలు అని రిటైర్డ్ అయిన కార్మికులు క్వాటర్ ఖాళీ చేస్తేనే లాభాల వాటా, మరియు దీపావళి బోనస్ చెల్లిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఏఐటీయూసీగా మేము దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, మరియు సింగరేణి సంస్థ యొక్క రూపాయలు గవర్నమెంట్ కి కోట్లల్లో ఇస్తున్నారు, విద్యుత్ సంస్థల నుండి సింగరేణి సంస్థకు వచ్చే 40 వేల కోట్లకు పైగా బకాయిలు సంస్థకి వచ్చే నిధులను మాత్రం రాబట్టడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని మరియు సింగరేణి సంస్థ లేని జిల్లాలో కోట్లల్లో ఖర్చు పెడుతున్నారు , సింగరేణిలో సంప్రదాయంగా వస్తున్న పండగ కార్మికులు ప్రతి సంవత్సరం కుటుంబ సభ్యులతో వారి వారి ఏరియాలలో సింగరేణి అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకుంటారు, కాకపోతే ఈ సంవత్సరం సింగరేణి అవతరణ దినోత్సవ పండుగకి మాత్రం సంస్థలో పైసలు లేవని ఏరియా జిఎం కార్యాలయంలో మాత్రమే సింగరేణి సంస్థ యొక్క అవతరణ దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని కావాలని తక్కువ బడ్జెట్ కేటాయించి కొంతమంది అధికారులు కావాలని కార్మికులలో రెచ్చగొట్టే పద్ధతి చేస్తున్నారు అని సంస్థ యొక్క భవిష్యత్తు నిర్వీర్యం చేయడానికి పూనుకున్నారని భవిష్యత్తులో అధికారులు తగిన మూల్యం చెల్లించుక తప్పదని దీనిని మేము ఏఐటీయూసీగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు

# కొండగట్టుకు మహర్దశ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ

చర్చ :- బ్యూరో కరీంనగర్ :వసతి గదుల నిర్మాణం కోసం స్థల పరిశిలించిన టిటిడి ఇంజనీర్ల బృందం...ఎపిడిప్యూటి సియం పవన్ కళ్యాణ్ చొరవతో కొండగట్టులో వసతి గదుల నిర్మాణం కోసం టిటిడి ఇంజనీర్ల బృందం స్థల పరిశీలన చేశారు.
కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో వసతి గదులు,మాల విరమణకు విశాలమైన ఆడిటోరియం నిర్మాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం నుండి 30 కోట్ల నిధుల ప్రొసీడింగ్ తీర్మానం చేపట్టారు. ఈ సందర్భంగా స్థల పరిశీలన కోసం టీటీడీ ఈఈ నరసింహమూర్తి తో పాటు ఇంజనీర్లు బృందం కొండపైకి చేరుకోవడంతో ఆలయ ఈవో శ్రీకాంత్ రావు టీటిడి అధికారులకు స్వాగతం పలికారు. ఘాట్ రోడ్డు పక్కన స్థలాన్ని అధికారులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంత్ రావు తో పాటు టీటిడి ఈఈ నరసింహమూర్తి, డిఈ పివి నాగరాజు, ఏఈ నాగరాజు కొండగట్టు ఆలయ సూపర్డెంట్లు హరిహరనాథ్, సునీల్ అధికారులు పాల్గొన్నారు.



# కోరుట్లలో చెస్ అభివృద్ధికి ముందడుగు


చర్చ, కోరుట్ల:- గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసలు కాకుండా, చెస్ ఆట ద్వారా మానసిక వికాసం, ఏకాగ్రత, క్రమశిక్షణ, విశ్లేషణాత్మక ఆలోచనశక్తి పెంపొందించుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. చెస్ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అద్భుతమైన మేధోక్రీడ అని పేర్కొన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రత్యేక చొరవతో, చెస్ నెట్వర్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
మల్లాపూర్ మండలం సాతర, మల్లాపూర్ గ్రామం, మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలలోవిద్యార్థులకు ఉచిత చెస్ బోర్డుల పంపిణీ చేశారు. చెస్ నెట్వర్క్ ఫౌండేషన్ సహకారంతో కోరుట్ల నియోజకవర్గంలో ప్రతి 15 మంది విద్యార్థులకు ఒక చెస్ బోర్డు అందే విధంగా ప్రణాళికాబద్ధంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగా ఈరోజు చెస్ బోర్డుల పంపిణీ చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందుకు వచ్చి సహకారం అందించినచెస్ నెట్వర్క్ ఫౌండర్ సుధీర్ కోదాటికి,రవి మయిరెడ్డికి, చెస్ నెట్వర్క్ ఫౌండేషన్ సభ్యులందరికీఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు,గ్రామాల్లోని యువతీ%-%యువకులు చెస్ ద్వారామానసిక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, నిర్ణయాత్మక సామర్థ్యం పెంపొందించుకునేలాభవిష్యత్తులో కూడా చెస్ బోర్డులు మరింతగా అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.. కోరుట్ల నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో విద్య, క్రీడలు, యువత అభివృద్ధిని కేంద్రంగా చేసుకునిఇలాంటి మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడతామనిఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ స్పష్టం చేశారు..

# తన్నీరు హరీష్ రావు ను కలిసిన ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ,ఏటురునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత



చర్చ ములుగు జిల్లా బ్యూరో డిసెంబర్ 20: ( ఏటూరు నాగారం ) :హైదరాబాద్ లో మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, శ్రీలత కలిశారు. ఏటూరునాగారంలో బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా కాకులమర్రి శ్రీలత భారీ మెజార్టీతో గెలుపొందడంతో మర్యాదపూర్వకంగా తన్నీరు హరీష్ రావుని కలిశారు. మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు కాకులమర్రి శ్రీలతను ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబును అభినందించి కాకులమర్రి శ్రీలతకు శాలువా కప్పి సన్మానించి ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించాలని హరీష్ రావు అన్నారు కాంగ్రెస్ పార్టీ మెడల వంచి భారీ విజయం సాధించటం మంచి పరిణామం అని ఇలాగే రాబోయే రోజుల్లో కూడా జడ్పిటిసి ఎంపీపీ లను ములుగు జిల్లాలో కైవసం చేసుకుని జడ్పీ పీఠం దక్కించుకోవాలని హరీష్ రావు సూచించారని కాకుల మరి లక్ష్మణ్ బాబు తెలిపారు.

# సమాచార హక్కు చట్టంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతం పాల్గొన్న ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (డీఎం సీఆర్ హెచ్ఆర్డీ) ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వ సమన్వయ సమస్త సహకారంతో సమాచార హక్కు చట్టం పై రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందికి సమాచార హక్కు చట్టం యొక్క లక్ష్యాలు, ప్రాధాన్యత, చట్టంలోని ముఖ్య నిబంధనలు, పౌరుల హక్కులు, ప్రభుత్వ అధికారుల బాధ్యతలు, సమాచారాన్ని అందించడంలో పాటించాల్సిన విధానాలు, అప్పీల్స్ ప్రక్రియ తదితర అంశాలపై నిపుణులచే సమగ్ర అవగాహన కల్పించారు.శిక్షణ కార్యక్రమం రెండో రోజు సందర్భంగా సమాచార హక్కు చట్టం అవసరత, పారదర్శకత, బాధ్యతాయుత పాలనలో ఆర్‌టీఐ చట్టం పాత్రపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాచార హక్కు చట్టం అత్యంత కీలకమని, ప్రజలకు సమయానుకూలంగా సరైన సమాచారం అందించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ తెలిపారు. అధికారులు చట్టాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని విధి నిర్వహణలో నిబద్ధతతో అమలు చేయాలని ఆయన సూచించారు.అనంతరం శిక్షణ కార్యక్రమంలో విజయవంతంగా పాల్గొన్న ఉద్యోగులకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ప్రభుత్వ సేవల నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.ఈ సమావేశంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ శిక్షణ మేనేజర్ ఆనంద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ కొండలరావు, శిక్షకులు మోహన్ కృష్ణతో పాటు వివిధ శాఖలకు చెందిన మొత్తం 82 మంది ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 22వ తేదీన మీ డబ్బు.. మీ హక్కు కార్యక్రమం

చర్చ,రాజన్న సిరిసిల్ల:- క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల కోసం ఈ నెల 22 వ తేదీన మీ డబ్బు.. మీ హక్కు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మధ్యాహ్నం 01.00 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా "మీ డబ్బు, మీ హక్కు" అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి 2025 అక్టోబర్ 4వ తేదీన గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. 2025 డిసెంబర్ 31వ తేదీ వరకు మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలిపారు.
క్లెయిమ్ చేసుకోని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా తదితరాలను క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని చేపట్టారని వివరించారు. బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేసుకోని డిపాజిట్ల వివరాలు ఆర్‌బీఐ ఉద్గమ్ వెబ్‌సైట్ (%ష్ట్రజూం://బఎస్త్రుఎ.తీఎఱ.శీతీస్త్ర.ఱఅ%) ద్వారా పొందొచ్చని తెలిపారు. క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల వాస్తవ యజమానులు వాటిని పొందేందుకు.. బ్యాంకు శాఖ, భీమా సంస్థ, మ్యూచువల్ ఫండ్ సంస్థ, శిబిరంలోని స్టాక్ బ్రోకరేజీ సంస్థ, ఆన్‌లైన్ ద్వారా స్టాక్ బ్రోకర్‌లలో దేనినైనా సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రామ్ కన్వీనర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు సూచించారు.

ఆదివారం,
డిసెంబర్ 21, 2025

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక



## పొన్నం ప్రభాకర్ కృషితో సెట్విన్ ఉపాధి శిక్షణ కేంద్రం



చర్చ:- హుస్నాబాద్:హుస్నాబాద్ మున్సిపల్ కాంప్లెక్స్ లో కొనసాగుతున్న సెట్విన్ ఉపాధి శిక్షణ కేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి సందర్శించారు. సెట్విన్ కేంద్రంలో ఇస్తున్న ఉపాధి శిక్షణ కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో సెట్విన్ ఉపాధి శిక్షణ కేంద్రం హుస్నాబాద్ లో ఏర్పాటు చెయ్యడం జరిగిందని కేడం లింగమూర్తి తెలిపారు. పదవ తరగతి చదివిన 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల వయసు గలవారు సెట్విన్ కేంద్రంలో అందిస్తున్న ఉపాధి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నామమాత్రపు ఫీజులతో ఐదు రకాల కోర్సులను అందివ్వడం జరుగుతుందన్నారు. ఔత్సాహికులైన సర్టిఫికెట్లు సమర్పించి శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి



చర్చ,గొదావరిఖని: రామగుండం కమిషనరేట్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. 1992 బ్యాచ్ కు చెందిన ఆయన ప్రస్తుతం కమీషనరేట్ లో విదులు నిర్వహిస్తున్నారు. అడిషనల్ డిసిపి అడ్మిన్ శ్రీనివాస్ గోదావరిఖని ఐబికాలనిలో ని రాజేంద్ర ప్రసాద్ నివాసానికి వెళ్లి పార్థీవదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి పోలీసు శాఖ తరుపున అండగా ఉంటామని



భరోసా కల్పించారు. పోలీసు శాఖ తరుపున అంతక్రియల కోసం వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. డీసీపీ అడ్మిన్

వెంట పీసీ ఆర్ ఇన్ స్పెక్టర్ శ్రీధర్,రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చిప్ప రాజమౌళి గౌడ్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచ లింగం, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణానికి నిదుల మంజూరు

చర్చ,కమాన్ పూర్: మంథని మండలంలోని మానేరు నదిపై ఆరెంద మీదుగా దామెరకుంట వరకు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.203 కోట్ల నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఈ నిధులను ఆర్ అండ్ బి (%=ఒడీ%) శాఖ ద్వారా మంజూరు చేశారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా 1.120 కిలోమీటర్ల పొడవు, 13 మీటర్ల వెడల్పుతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. అలాగే ఆరెంద, మల్లారం, వెంకటాపూర్ గ్రామాల నుంచి బ్రిడ్జి వరకు మరియు అటు వైపు దామెరకుంట రోడ్డు వరకు మొత్తం 9.530 మీటర్ల వెడల్పుతో అప్రోచ్ రోడ్లు కమ్ రోడ్డు నిర్మించనున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో మంథని మండలంతో పాటు పెద్దపల్లి జిల్లా ప్రజలకు గణనీయమైన ప్రయోజనం చేకూరనుంది. కాళేశ్వరం దేవాలయానికి వెళ్లే దూరం సుమారు 25 కిలోమీటర్లు తగ్గనుండగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం, ఇతర జిల్లాలు, మహారాష్ట్రకు రవాణా మరింత సులభమవుతుంది. దీంతో పాటు కాళేశ్వరం టూరిజం అభివృద్ధికి కూడా దోహదపడనుంది. అలాగే ఆరెంద, మల్లారం, వెంకటాపూర్, దామెరకుంట గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడడంతో పాటు వైద్య, విద్యా అవసరాలకు సులభంగా చేరుకునే అవకాశం ఏర్పడనుంది. పెద్దపల్లి%-%జయశంకర్ భూపాలపల్లి జిల్లాల మధ్య కనెక్టివిటీ మరింత బలపడనుంది.

మానేరు నదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.203 కోట్ల నిధులు మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి పెద్దపల్లి జిల్లా, మంథని మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ముత్తారం ఎంపిడిఓ జి.లలిత సస్పెన్షన్

### కమాన్ పూర్ ఎంపీడీవో గా పని చేస్తున్న సమయంలో అవకతవకలు..

చర్చ: పెద్దపల్లి:ముత్తారం ఎంపిడిఓ, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అథారిటీ లో ఏ.పీ.డీ గా డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న జి.లలిత ను సస్పెండ్ చేస్తూ పెద్దపలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా గతంలో పనిచేసిన ఎం.తిరుపతి అవినీతి కారణంగా సర్వీస్ నుంచి తొలగించడం జరిగింది. ఎం తిరుపతి విచారణ సమయంలో అప్పటి కమాన్ పూర్ ఎంపీడీఓ గా విధులు నిర్వహించిన జి.లలిత కు అవినీతి డబ్బులు వాటా పంపినట్లు మాజీ పంచాయతీ కార్యదర్శి ఎం.తిరుపతి వాంగ్మూలం, ఫోన్ పే స్క్రిన్ షాట్స్ సమర్పించారని కలెక్టర్ పేర్కొన్నారు. పిడి హౌసింగ్ జే. రాజేశ్వర్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి రిపోర్ట్ అందించాల్సిందిగా ఆదేశించడం జరిగిందని, ఎం.తిరుపతి వాంగ్మూలం సంబంధించి జి లలిత ఎంపీడీవో పై చేసిన ఆరోపణలకు ఆధారాలు లభించాయని, పీడీ హౌసింగ్ చేపట్టిన విచారణకు ఎంపీడీవో జి లలిత నుంచి సహకారం లభించ లేదని రిపోర్ట్ సమర్పించినట్లు కలెక్టర్ తెలిపారు. పిడి హౌసింగ్ అందించిన రిపోర్ట్ అందుబాటులో ఉన్న సాక్షాల పరిశీలన మేరకు ముత్తారం ఎంపిడిఓ, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అథారిటీ లో ఏ.పీ.డీ గా డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న జి.లలిత ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసారు. సస్పెన్షన్ సమయంలో హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళడానికి వీలు లేదని కలెక్టర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

## మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై వ్యాపారాలు చేయరాదు



చర్చ:- హుస్నాబాద్: హైవే రహదారి పక్కన ఉన్న మురికి కాలువను ఆక్రమించవద్దు :హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ టీ. మల్లికార్జున్వ్యాపారస్తులు, దుకాణాదారులు హైవే రోడ్డు పక్కన డ్రైనేజీ పై ఎలాంటి షాప్ బోర్డులు గాని, బండ్లు గాని, ఇతర వ్యాపారాలు గాని దుకాణాల కు సంబంధించిన వస్తువులు పెట్టవద్దని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ టి .మల్లికార్జున్ హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలోని ప్రధాన రహదారి రోడ్డు వెంబడి గల దుకాణా దారులను హెచ్చరించారు. ఒకవేళ దుకాణాదారులు, వ్యాపారస్తులు మున్సిపల్ నిబంధనలకు వ్యతిరేకంగా పాల్పడినట్లయితే చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీ పై వ్యాపారాలు కొనసాగిస్తున్న దుకాణ యజమానులకు జరిమానా విధించారు. డ్రైనేజీ పై దుకాణదారులు పెట్టిన హోర్డింగ్ లు, పలు హోటల్ల సామానును మున్సిపల్ ట్రాక్టర్ లో వేసి మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలోని ప్రధాన రహదారి బస్ డిపో రోడ్డు క్రాస్ నుండి వ్యవసాయ మార్కెట్ రోడ్డు వరకు, అక్కన్నపేట చౌరస్తా నుండి నాగారం రోడ్డు, అక్కన్నపేట రోడ్డు, రామవరం రోడ్డు రహదారి వెంట ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దుకాణదారులు, వ్యాపారస్తులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేయవద్దని కమిషనర్ హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ వెంట హుస్నాబాద్ ఎస్ఐ లక్ష్మారెడ్డి , మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, మున్సిపల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# జిల్లాలో రహదారి భద్రతకు పటిష్టమైన చర్యలు

- జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్






చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జనవరి నెలలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాలపై రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రహదారి ప్రమాదాల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతుండటంతో పాటు పలువురు గాయాల పాలవుతున్నారని, దీని వల్ల బాధిత కుటుంబాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ యజమాని మృతి చెందితే అతనిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల బాధలు వర్ణనాతీతమని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నందున వాటి నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమిష్టిగా, సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రవాణా, పోలీస్, అబ్కారి, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు సమన్వయంతో జనవరి నెలలో నిర్వహించనున్న రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లాలో రహదారి భద్రతకు సంబంధించి చేపడుతున్న చర్యలపై వివరించారు. జిల్లాలో రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు అవసరమైన స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రహదారుల వెంట ఏర్పడే గుంతలను పూడ్చేందుకు గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ కార్మికుల ద్వారా ఎప్పటికప్పుడు మరమ్మత్తుల కార్యక్రమం చేపడుతున్నామని వెల్లడించారు. జిల్లాలో రహదారులపై ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రమాదాల నివారణకు సిసి కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులను గుర్తించి తగిన చర్యలు తీసుకునేలా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే విధంగా తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మెరుగైన అత్యవసర వైద్య సేవల కోసం జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ నిర్మాణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా నూతనంగా మూడు బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు చేయడం జరిగిందని, రహదారి ప్రమాదాల సమయంలో బాధితుల ప్రాణాలను కాపాడడంలో ఇవి కీలక పాత్ర పోషించ నున్నాయని ఆయన అన్నారు. జనవరి నెలలో నిర్వహించనున్న జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో రహదారి భద్రతపై చైతన్యం తీసుకురావడానికి అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.

ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ మురళి, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, క్రీడా శాఖ అధికారి పరందామ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని కలిసిన ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారు ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత







చర్చ ములుగు జిల్లా బ్యూరో డిసెంబర్ 20:( ఏటూరు నాగారం) ములుగు జిల్లా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ బీఆర్ఎస్ పార్టీ భారీ విజయం సాధించటంతో పాటుగా 3,230 మెజార్టీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పై భారీ విజయం సాధించడంతో ఏటూరు నాగారం గడ్డపై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయడం జరిగినది ఈ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆహ్వానం మేరకు హైదరాబాదులో కేటీఆర్ నంది నివాసంలో కలిసిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కలిశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి దిమ్మతిరిగే మెజార్టీని ఇచ్చి చరిత్ర సృష్టించారని అన్నారు. ములుగు జిల్లాలో మేజర్ గ్రామపంచాయతీలో అత్యధిక రాష్ట్రంలోనే అత్యధిక 3,230 మెజార్టీతో భారీ విజయం సాధించటంతో కేటీఆర్ కాకులమర్రి శ్రీలతను శాలువా కప్పి సన్మానించారు. ఏటూర్ నాగారం సర్పంచ్ గా గెలుపొందిన కాకులమర్రి శ్రీలతకు మాజీ మంత్రివర్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఏటూరు నాగారం గ్రామపంచాయతీని మంచి అభివృద్ధి పథంలో నడిపించాలని కేటీఆర్ అన్నారు ఏ అవసరం ఉన్నా మీకు నేనున్నానని ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, రంజిత్ రెడ్డి, తాటికొండ రాజయ్య , తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరతకు చెక్

- బుకింగ్ యాప్ ద్వారా రైతులకు యూరియా సరఫరా.
- పెద్దపల్లి పట్టణం లోని జెండా రోడ్డు వద్ద మహేష్
- ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసిన కలెక్టర్



చర్చ : పెద్దపల్లి : యూరియా బుకింగ్ యాప్ ద్వారా కొనుగోలు చేయడం సులభతరం అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద గల మహేష్ ఫెర్టిలైజర్స్ ఎరువుల షాపును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యూరియా లభ్యతపై రైతులకు ఎటువంటి అనుమానాలు, అపోహలు అవసరం లేదని, ప్రతి రైతుకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. యూరియా ప్రతి రైతుకు చేరాలని ఉద్దేశంతో జిల్లాలో యూరియా ట్రాకింగ్ యాప్ సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. గత నెల రోజుల నుండి యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జిల్లాలో పర్యవేక్షించామని కలెక్టర్ తెలిపారు. మనం అనుసరించిన విధానాన్ని పరిశీలించిన ప్రభుత్వం మరింత మెరుగ్గా యూరియా బుకింగ్ యాప్ ప్రవేశ పెట్టిందని అన్నారు. ఓలా, ఉబర్ వంటి యాప్ లలో టాక్సీ ఎలా బుక్ చేస్తామో , అదేవిధంగా సులభంగా ఇంటి నుంచే యూరియా బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. రైతులు తమ ఇంటి వద్ద నుంచి యూరియా బుక్ చేసుకుని ఎరువుల షాప్ కు స్వయంగా వచ్చి లేదా ఇతరులతో తమ బుక్ చేసుకున్న బస్తాల వివరాలు, ఓటిపి చెప్తే షాప్ యజమానులు యూరియా సరఫరా చేస్తారని, ఈ యాప్ ఉపయోగించడం వల్ల రైతుల సమయం వృధా కాదని, లైన్లలో నిలబడకుండా సరైన సమయంలో వచ్చి యూరియా తీసుకువెళ్లచ్చని అన్నారు. యాప్ విధానం ద్వారా రైతులు అవసరానికి మించి యూరియా తీసుకొని వెళ్లి స్టాక్ పెట్టుకోవడం నియంత్రించవచ్చని, చిన్న సన్న కారు రైతులకు ఎటువంటి యూరియా కొరత రాకుండా ఉంటుందని తెలిపారు.

రైతులు తమ వ్యవసాయ భూమి వివరాలు తమకు ఎంత యూరియా అవసరమంటుందో ఇంకా ఎన్ని కావాలో అనే అంశాలు ఈ యాప్ లో నమోదవుతాయని కలెక్టర్ తెలియజేశారు. రైతులు ఈ యాప్ ను ఉపయోగించడం సులభంగా ఉంటుందని ప్రతి ఒక్కరు యాప్ ఉపయోగించుకొని యూరియా కొనుగోలు చేయాలని ఆప్ ఉపయోగించడంలో ఏదైనా సమస్యలు ఏర్పడితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏ. ఓ.లు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మేరా యువ భారత్ కేంద్రం, ఉమ్మడి వరంగల్ జిల్లాల (6 జిల్లాలు)



### యువజన సంఘాల నుండి క్రీడా సామాగ్రి కొరకు దరఖాస్తుల ఆహ్వానం

చర్చ ములుగు జిల్లా బ్యూరో డిసెంబర్ 20: (వరంగల్) :భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల మరియు క్రీడల మంత్రిత్వశాఖ 2025-26 ఆర్థిక సంవత్సరమునకు గాను మేర యువ భారత్ వరంగల్ వారి ఆధ్వర్యంలో క్రీడా సామాగ్రి పంపిణీ చేయుటకు ఉమ్మడి వరంగల్ జిల్లాల యువజన సంఘాల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్టు మేర యువ భారత్ ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మై భారత్ వెబ్ సైట్ లో రిజిస్టర్ అయిన ఉమ్మడి జిల్లాలు అనగా వరంగల్, హనంకొండ, జనగాం, భూపాలపల్లి ,ములుగు, మహబూబాబాద్ జిల్లాలలోని యువజన సంఘాలు మేర యువ భారత్ కేంద్రంలో అనుసందనమైన యువజన సంఘాలు ,మహిళ మండలిల నుండి దరఖాస్తు ఈ నెల 31 వ తేదీ లోగా మేర యువ భారత్ కేంద్ర లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్రీడా సామాగ్రికి దరఖాస్తు తో యువజన సంగం మై భారత్ వెబ్సైట్ రిజిస్ట్రేషన్ జిరాక్స్ తో పాటుగా వారి యొక్క బైలాస్ కాపీని కూడా జత చేయాలి, అదే మాదిరిగా గత కాలంలో వారు చేసినటువంటి కార్యక్రమాల పత్రికా ప్రకటనలు, ఫోటోలు జత చేయాలి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి యువజన సంఘాలకు, మహిళ మండలిలకు క్రీడా సామాగ్రి ఇవ్వనునట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు మేర యువ భారత్ కేంద్రం కార్యాలయంలో లేదా 0870-2958776 ఫోన్ నంబర్ ను సంప్రదించాలని కోరారు.

## రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు



**విద్యార్థులను అభినందించిన పాఠశాల చైర్మన్ సంజీవ్ కుమార్ :** చర్చ,సుల్తానాబాద్: రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలకు పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో అక్టోబర్ నెలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి 14 సంవత్సరాల బాలబాలికల టేబుల్ టెన్నిస్ పోటీలలో సుల్తానాబాద్ పట్టణంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ఈ వర్షిత,టి అభిజ్ఞ శ్రీ, ఏం సంప్రీత్ లు జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి ఈనెల 22 నుండి 24వ తేదీ వరకు హైదరాబాదు లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.వీరి ఎంపిక పట్ల పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ హర్షం వ్యక్తం చేశారు.
క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో విద్యార్థులు బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, శివ, సతీష్, మమత విద్యార్థులు పాల్గొన్నారు.


## బాలవికాస ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్



**చర్చ : రామగిరి:** రాజాపూర్ గ్రామ ప్రజలు రక్షితమైన శుద్ధ జలాలను త్రాగాలనే సదుద్దేశంతో రాజాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీమతి పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య , ఉపసర్పంచ్ కలవేన శ్రీకాంత్ ముదిరాజ్ బాలవికాస సేవా విభాగాన్ని కలిసి సంప్రదింపులు జరిపారు.ఈ సందర్భంగా బాలవికాస బృందం రాజాపూర్ గ్రామ ప్రజలకు తమ వంతు సహాయంగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. గ్రామ ప్రజలకు మరింత మేలు చేకూర్చే విధంగా బాలవికాస సంస్థ ద్వారా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని సర్పంచ్ శ్రీమతి భాగ్యలక్ష్మి కొమురయ్య ,
ఉపసర్పంచ్ శ్రీకాంత్ ముదిరాజ్ ఆకా ంక్షించారు.ఈ కార్యక్రమంలో లద్నాపూర్ గ్రామ సర్పంచ్ వనం రాంచందర్ రావు, వార్డు సభ్ యులు కాల్వ రజిత శ్రీనివాస్, కలవేన స్వరూప రమేశ్, కన్నూరి శశికుమార్, కాదాసి రమేష్, హాఫీ జుద్దీన్, అలాగే నాయకులు మాటేటి రవి, ఉమ్మనవేన కుమార్, ఉగ్గె ప్రశాంత్, మాటేటి శ్రీని వా స్, కన్నూరి వెంకటి, మొగిలిరేణుక, నిట్టూరి స్వరూప, గరిగంటి దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికలలో గులాబీ జెండా ఎగుర వేద్దాం

- **నూతన సర్పంచ్ ల అభినందనసభ లో మాజీ ఎమ్మెల్యే సండ్ర**





**చర్చ, సత్తుపల్లి:** పెనుబల్లి మండలం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కనగాల వెంకట్రావు అధ్యక్షతన నూతనంగా గెలిచిన సర్పంచ్ లకు వి యం బంజర్ సప్తపది ఫంక్షన్ హాల్ నందు అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది.. ఈ అభినందన సభ కి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని పెనుబల్లి మండల పరిధిలో గెలిచిన ప్రతి బిఆర్ఎస్ సర్పంచ్ లకు శాలువాలు తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాబోయే కాలంలో ఎంపీటీసీ, జడ్పిటిసి, మున్సిపల్, ఎన్నికల్లో కచ్చితంగా గులాబీ జెండా ఎగర వేద్దాం. గెలిచిన సర్పంచ్ విజయగర్వంతో కాకుండా నిరంతరం ప్రజా సేవలో ప్రజల మధ్య ఉండాలని సూచించారు. ఓడిపోయిన వారు ఆదేర్య పడుద్దని రాబోయే కాలంలో వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని కోరారు. మనవాళ్ల ను ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఆ దైర్యం పడకుండా ధైర్యంతో ముందుకు సాగారు. ఇప్పటికైనా బెదిరింపు రాజకీయాలతో ఏమి సాధించలేరని సూచించారు.. కక్షపూరిత రాజకీయాలు చేస్తే ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు,.ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్, బీ ఆర్ యస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వైరా నియోజకవర్గ పాస్టర్స్ ఇవాంజెలిస్ట్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



**చర్చ: వైరా :** నిస్సీ వైరా నియోజకవర్గ పాస్టర్స్ ఇవాంగెలిస్ట్స్ ఫెలోషి నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది ఈ కమిటీ గౌరవ అధ్యక్షులు. పీటర్ బాబు. వినోద్ కుమార్. ప్రెసిడెంట్. ఏసుదాసు.వైస్ ప్రెసిడెంట్ సీమోను, సెక్రటరీ. చిన్న బాబు. జాయింట్ సెక్రటరీ. బాబు రావు ట్రెజరర్. వర్ధన్ బాబు కో ట్రెజరర్. నిరీక్షణకుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్. జాషువా, గౌరవ సలహాదారులుగా జీవరత్నం, ఆశీర్వాదం, . సురేష్, సురేష్.నవీన్ కుమార్, రవి. ఏరియా కమిటీ మెంబర్స్. %ు%. శ్యాంసన్. సురేష్ లను కమిటీ వారు ఎన్నుకోవడం జరిగినది,

# జూదం రాయుళ్ళకు పోలీసు వారి హెచ్చరిక

- **ప్రత్యేక షీట్లు ఓపెన్ చేయబడును సీఐ తుమ్మలపల్లి శ్రీహరి**



**చర్చ, సత్తుపల్లి:** సత్తుపల్లి మండల ప్రజలకు తెలియచేయునది ఏమనగా రాబోవు డిసెంబర్ -31, మరియు సంక్రాంతి పండుగ సందర్భముగా ఎక్కువరోజులు సెలవులు ఉన్నందున ప్రజలు వారి వారి ఊళ్ళకు వెళ్ళే సమయములో వారి ఇండ్లకు తాళాలు వేసి, ఇంట్లో ఎలాంటి విలువైన ఆభరణాలు పెట్టకుండా సరైన జాగ్రతలు తీసుకొని వెళ్లవలెను, మరియు పోలీసు వారికి తెలియపరచవలెనుదకోళ్ళపందేలు..రాబోవు డిసెంబర్ -31, మరియు సంక్రాంతి పండుగ సందర్భముగా ఎవరైనా కోళ్ళ పందేలు వేయుటకు శిబిరాలు నిర్వహించినా, కోళ్ళ పందేలు వేసిన, కత్తులు కట్టినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకొని నిర్వహించిన వారిపై, కోడి పందేలు వేసిన వారిపై పోలీస్ స్టేషన్ నందు ప్రత్యేక నిఘా షీట్లు తెరవబడును.
మరియు బైండ్ ఓవర్ కూడా చేయబడును.రాబోవు డిసెంబర్ -31, మరియు సంక్రాంతి పండుగ సందర్భముగా ఎవరైనా జూద శిబిరాలు నిర్వహించినా, ఎటువంటి
జూదము ఆడినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకొని నిర్వహించిన వారిపై, జూదము ఆడిన
వారిపై పోలీస్ స్టేషన్ నందు ప్రత్యేక నిఘా షీట్లు తెరవబడును అని సత్తుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి హెచ్చరించారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- **కేంద్ర ఆరోగ్య పథకాల పనితీరుపై సమీక్ష**





**చర్చ, రాజన్న సిరిసిల్ల:-** స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. రాజన్న సిరిసిల్లలో 27 స్కానింగ్ కేంద్రాలు పనితీరు, చట్టపరమైన నిబంధనల అమలు, తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఫారం ఆఫ్ ఆడిట్ వివరాలపై, ఏడు స్కానింగ్ సెంటర్ల దరఖాస్తుల రెన్యూవల్, రిజిస్ట్రేషన్ల కొరకు వచ్చాయని కమిటీకి తెలిపారు. లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు గుర్తిస్తే 10,000 జరిమానాతో పాటు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తామని తెలిపారు.
అనంతరం బోయినపల్లి మండలంలోని విలాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో కేంద్ర ఆరోగ్య పథకాల పనితీరుపై సమీక్షించారు. గర్భిణీ స్త్రీల నమోదు, మొదటి చెకప్ వివరాలు, సాధారణ ప్రసవాలు, ప్రమాదకర సంకేతాలు గల గర్భిణీ స్త్రీలను గుర్తించి( ఐఎఫ్ఎ మాత్) హెచ్ఎంఐఎస్ ఆన్లైన్లో నమోదు కార్యక్రమంపై మరియు ఆడపిల్లల జననాలు (సెక్స్ రేషియో) తక్కువగా ఉండడానికి కారణాలపై సమీక్షించి, లక్ష్యాలు సాధించాలని లేనియెడల చర్యలు తీసుకుంటామని సూచించారు.

# జిల్లాలో విపత్తుల నిర్వహణకు ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ఈఓసీ)ను పటిష్టంగా అమలు చేయాలి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

- **22న బూర్గంపాడు లో మాక్ డ్రిల్**



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :** ప్రకృతి వైపరీత్యాలు, ఇతర విపత్తుల సమయంలో సమర్థవంతమైన స్పందనతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు ముందస్తు అప్రమత్తత అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 22వ తేదీన విపత్తుల నిర్వహణపై మాక్ డ్రిల్ నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.
శనివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనలతో కలిసి విపత్తుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ఈఓసి)ను జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విపత్తుల సమయంలో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాలో ఈఓసి కీలక పాత్ర పోషిస్తుందని, ఇందులో జిల్లా స్థాయి అధికారులు,రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, ఫైర్, పోలీస్, ఎస్ఆర్డిఎఫ్, ఎన్ఆర్డిఎఫ్ తదితర విభాగాలు సభ్యులుగా ఉండాలని తెలిపారు. ఈఓసి ద్వారా విపత్కర పరిస్థితుల్లో చేపట్టవలసిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సామాగ్రి, వనరులు, పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.
విపత్తు పరిస్థితులను ముందుగానే అంచనా వేయగలిగితే నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, విధుల్లో ఎలాంటి అలసత్వం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని, అందుబాటులో ఉన్న అన్ని సమాచార, సాంకేతిక సాధనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. వర్షపాతం వివరాలు, ప్రాజెక్టులు మరియు రిజర్వాయర్ల నీటిమట్టం, నీటి విడుదల, వంతెనలు, రోడ్ల ప్రస్తుత పరిస్థితి వంటి అంశాలపై రియల్ టైమ్ సమాచారం ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా మ్యాప్‌తో పాటు అవసరమైన అన్ని మ్యాపులు సిద్ధంగా ఉంచాలని, వరదలు సంభవించినప్పుడు క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన చర్యలు, పునరావాస కేంద్రాల గుర్తింపు, పునరావాస కేంద్రాల్లో కల్పించవలసిన సదుపాయాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అవసరమయ్యే ఆరోగ్య, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, తాగునీరు, మునిసిపల్ సేవలు తదితర విభాగాలకు సంబంధించిన టోల్ ఫ్రీ నంబర్లు, హెల్ప్‌లైన్ వివరాలు ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. లైఫ్ జాకెట్లు, బోట్లు, ఇతర రక్షణ సామాగ్రి అందుబాటులో ఉంచాలని, పోలీస్ విభాగం నుంచి అవసరమైన సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశించారు.
గోదావరి నది ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహించినప్పుడు తీసుకోవలసిన చర్యలపై స్పష్టమైన కార్యాచరణ ఉండాలని, దీనిని ఆచరణలో పరీక్షించేందుకు ఈ నెల 22న బూర్గంపాడులో మాక్ డ్రిల్ నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
మాక్ డ్రిల్ సందర్భంగా విపత్తు నిర్వహణ ప్రణాళికల అమలు, శాఖల మధ్య సమన్వయం, స్పందన వేగం, రక్షణ చర్యలు, సహాయక సేవల అందుబాటు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దుకొని వాస్తవ విపత్తుల సమయంలో మరింత సమర్థవంతంగా పనిచేయవచ్చని తెలిపారు.
విపత్తుల నిర్వహణలో ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, ప్రతి అధికారి తన పరిధిలోని సిబ్బందికి తగిన శిక్షణ అందించి, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా కట్టుదిట్టంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ మురళీ, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, ఆర్ టి ఓ వెంకటరమణ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభినందన సభ సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయాన్ని సాధించిన బీఆర్ఎస్





**చర్చ, సత్తుపల్లి:** సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయాన్ని సాధించిన బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్‌లకు అభినందన సభను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు ఆయన శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో దాదాపు 15 గ్రామప ంచాయతీల్లో తక్కువ తేడాతో ఓటమి ఎదురైనప్పటికీ, ప్రత్యర్థులు స్థానిక సంస్థల ఎన్నికలను అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా మారా ్చరని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే ని పక్కన పెట్టి కొందరు నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడి ఓటర్లను భయపెట్టారని, అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని ఆయన విమర్శించారు.అన్ని అడ్డంకులు ఎదురైనా బీఆర్ఎస్ శ్రేణులు ధైర్యంగా పోరాడి విజయాన్ని సాధించారని సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా 85 పంచాయతీల్లో పోటీ చేసి, 41 పంచాయతీల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని స్పష్టం చేశారు. గెలిచిన కొన్ని రెబల్స్ ను తమవాళ్లుగా చూపించడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ప్రతి విషయం ప్రజలు గమనిస్తున్నారని, ఫ్యాక్షన్ రాజకీయాల మాదిరిగా పాలన సాగుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇదేనా ప్రజాపాలన అంటూ ప్రశ్నించారు.సర్పంచ్‌లందరూ రాజకీయాలకు అతీతంగా ప్రజల సేవకులుగా పనిచేయాలని సూచించారు. దేశంలోని 20 ఉత్తమ గ్రామపంచాయతీలలో 17 తెలంగాణకు రావడం మన గ్రామపాలన బలాన్ని చాటుతోందని అన్నారు. కానీ, గత రెండేళ్ ్లగా గ్రామపంచాయతీ వ్యవస్థ కుప్పకూలిపోయిందని, ఆ వ్యవస్థను మళ్లీ బలోపేతం చేయడం మన అందరి బాధ్యతగా పేర్కొన్నారు.ఈ పోరాట స్ఫూర్తితో రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించాలనే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన బీఆ ర్ఎస్ సర్పంచ్, వార్డ్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కొత్త సిట్ విచారణ కీలకఅంశాలపై ఫోకస్



హైదరాబాద్, డిసెంబరు20 : తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ మరింత వేగం పుంజుకుంది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు (శనివారం) నుంచి కీలక విచారణను ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రధాన నిందితుడిగా భావిస్తున్న ప్రభాకర్ రావును పోలీసులు మళ్లీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.జూబ్లీహిల్స్ పీఎస్‌లో ప్రస్తుతం ప్రభాకర్ రావును సిట్ అధికారులు తీవ్రంగా విచారిస్తున్నారు. ఈ కేసును సమగ్రంగా పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సిట్‌ను నియమించగా.. ఆ బృందంతో నిన్న (శుక్రవారం) హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేసు పురోగతి, విచారణ విధానం, సాంకేతిక అంశాలు, ఆధారాల సేకరణ వంటి పలు కీలక విషయాలపై సిట్ అధికారులకు సీపీ స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.ఈ సూచనల మేరకు శనివారం ఉదయం నుంచే పలువురు సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణ ప్రారంభించారు. అధికారులు ఈ వారం రోజుల పాటు ప్రభాకర్ రావును నిరంతరంగా ప్రశ్నించనున్నారు. సిట్ విచారణను సమర్థవంతంగా నిర్వహించేందుకు బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక రూమ్‌ను కేటాయి ంచారు. అక్కడే కస్టోడియల్ విచారణ జరగనుంది. ప్రభాకర్ రావును ఈ నెల 25వ తేదీ వరకు కస్టడీలో ఉంచి విచారించేందుకు కోర్టు అనుమతి లభించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఇతర నిందితులను కూడా సిట్ అధికారులు పిలిపించి, ప్రభాకర్ రావు ఎదుటే ప్రశ్నిస్తున్నారు. గతంలో వారు ఇచ్చిన స్టేట్‌మెం ట్లు, సాంకేతిక ఆధారాలు, డేటా విశ్లేషణ ఆధారం గా ప్రభాకర్ రావును సమగ్రంగా విచారిస్తు న్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా భావిస్తున్న ప్రణీత్ రావుతో కలిపి కూడా ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. వీరిద్దరి మధ్య జరిగిన సంభాష ణలు, ఆదేశాలు, అమలైన విధానం, రాజకీయ నేతలు, ఇతరుల ఫోన్ల ట్యాపింగ్ అంశాలపై స్పష్టత కోసం అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.ఈ వారం రోజుల విచారణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన కొత్త ఆధారాలు, మరికొందరి పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# ఏకంగా ఆస్పత్రిలోనే డ్రగ్స్ వినియోగం వ్యక్తి అరెస్ట్



హైదరాబాద్, డిసెంబర్ 20: మరికొద్దిరోజుల్లో నూతన సంవత్సరం రానుంది. దీంతో డ్రగ్స్ మూలాలపై ఇప్పటికే నార్కొటిక్స్ బ్యూరోతో పాటు హైదరాబాద్ పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో నగరంలోని ఓ ఆస్పత్రిలో డ్రగ్స్ కలకలం రేపుతోంది. ఎస్ఆర్ నగర్ పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రిలో కేఫిటేరియా మేనేజర్ వద్ద డ్రగ్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మేనేజర్ ఆసిఫ్ వద్ద ఎమ్‌డీఎమ్‌ఏ డ్రగ్స్‌ను పట్టుకున్నారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు.గత కొంతకాలంగా ఆసిఫ్ వ్యక్తిగతంగానే డ్రగ్స్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లి సేవిస్తున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చాయి. అయితే ఎమ్‌డీఎమ్‌ఏ డ్రగ్ ఎవరి ద్వారా ఆసిఫ్‌కు సరఫరా అవుతుందనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లో ప్రతీ సారి డ్రగ్స్ వినియోగం భారీగా ఉంటోంది. ఈ ఏడాది ఎక్కడా కూడా డ్రగ్స్ మాట వినపడొద్దనే ఉద్దేశంతో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా డ్రగ్స్ తీసుకుంటున్న ఆసిఫ్‌ను అదుపులోకి తీసుకుని పూర్తిగా విచారిస్తున్నారు పోలీసులు. అతడిచ్చే సమాచారంతో మరి కొంతమందిని పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం

# సహచరుడి మృతి పాడె మోసిన పొంగులేటి కన్నీటి వదనంతో





రాజకీయాలు అంటే నిత్యం విమర్శలు చేసుకోవడం, ఆరోపణలు అని మాత్రమే అనుకుంటారు చాలా మంది. పార్టీలు, సిద్ధాంతాల పరంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే నేతలు.. వ్యక్తిగతంగా మాత్రం అందరితో కలివిడిగా ఉంటూ సత్సంబంధాలు కొనసాగిస్తారు. రాజకీయాలకు అతీతంగా అందరితో స్నేహ సంబంధాలను నెరిపే నాయకులు ఎందరో ఉన్నారు. వ్యక్తిగతంగా నిర్వహించుకునే కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేస్తుంటారు. అలాగే కష్టం వస్తే కదిలి వస్తారు. సహచరులు ఎవరైనా మరణిస్తే పదవి, హోదాలను పక్కన పెట్టి మరీ వస్తారు. తాజాగా ఇదే సీన్ కనిపించింది. అనుచరుడి అంత్యక్రియల్లో పాడె మోశారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యడవల్లి రామిరెడ్డి చనిపోయారు. రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆయన తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూశారు. ఆయన మృతితో నియోజకవర్గంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. యడవల్లి మృతి గురించి తెలుసుకున్న తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయన నివాసానికి తరలి వచ్చారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ.. తన వెన్నంటి నడిచిన యడవల్లి మరణం తనను తీవ్రంగా కలచివేసింది అన్నారు. అనుచరుడి అకాల మరణంతో కన్నీటి పర్యంతమైన పొంగులేటి.. తన హోదాని పక్కన పెట్టి మరీ.. రామిరెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన పాడె మోశారు. ఈ దృశ్యం ప్రతి ఒక్కరిని కదిలించింది.యడవల్లి రామిరెడ్డి అంత్యక్రియలు శనివారం నాడు పాలేరులో నిర్వహించారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి తన ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి మరీ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. రామిరెడ్డికి కడసారి వీడ్కోలు పలుకుతూ మంత్రి పొంగులేటి స్వయంగా పాడె మోశారు. సాధారణ కార్యకర్తలు, ఇతర నాయకులతో కలిసి శ్మశాన వాటిక వరకు నడిచి రామిరెడ్డిపై తనకు ఉన్న అపారమైన గౌరవాన్ని, అభిమానాన్ని చాటుకున్నారు. ఒక రాష్ట్ర మంత్రి హోదాలో ఉండి కూడా, తన అనుచరుడి కోసం పొంగులేటి.. ఆ హోదాను పక్కకు పెట్టి మరీ పాడె పట్టి.. కడసారి వీడ్కోలు పలకడాన్ని చూసి స్థానికులు భావోద్వేగానికి గురయ్యారు.సీనియర్ నాయకుడు రామిరెడ్డి మృతితో పాలేరు గ్రామంలో తీవ్ర విషాదం నిండుకుంది. ఆయనను కడసారి చూసేందుకు.. భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పార్టీ ఎంతో నిబద్ధత గల సీనియర్ నాయకుడిని కోల్పోయింది అన్నారు. తన రాజకీయ ప్రయాణంలో రామిరెడ్డి పాత్ర మరువలేనిది అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

# అది సిగ్గులేని సంసారం



హైదరాబాద్, డిసెంబర్ 20: కాంగ్రెస్‌లో చేరినా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెప్పుకునే ఆ పది మంది ఎమ్మెల్యేల జీవితం 'సిగ్గులేని సంసారం' అంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాట్ కామెంట్ చేశారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.స్పీకర్ విచిత్రమైన తీర్పు ఇచ్చారని, ఆ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో ఉంటే తమతోపాటు వచ్చి కూర్చోవాలని సవాల్ విసిరారు. 'చేర్చుకున్న వాళ్లు మా వాళ్లు కాదు' అని కాంగ్రెస్ చెబుతోందని ఎగతాళి చేశారు. కేసీఆర్.. తెలంగాణ సాధన వల్లే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, లేకపోతే వారికి పదవులే లేవని తలసాని చెప్పారు.'ఇంకా రెండేళ్లే... తర్వాత మనమే వస్తాం. ఎలా డ్యాన్స్ ఆడిస్తామో అలా ఆడిస్తాం' అని తలసాని హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సీఎం రేవంత్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీతో కాంగ్రెస్ మోసం చేసిందని, సంక్షేమ నిధులు ఎమ్మెల్యేల ఇళ్ల నుంచి వస్తున్నాయా అని ప్రశ్నించారు.సచివాలయం, ప్రజా భవన్ బాగాలేవని కాంగ్రెస్ అంటోంది.. మరి.. రోజూ అక్కడే ఎందుకు కూర్చొంటారని తలసాని ఎద్దేవా చేశారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఇలాంటి దరిద్రమైన ప్రభుత్వం చూడలేదని తలసానిఅన్నారు. రాష్ట్రంలో 25 ఏళ్ల వరకు కాంగ్రెస్ అనే మాటే రాదని తలసాని జోస్యం చెప్పారు.

# వారంతా ఒకవైపు బీఆర్ఎస్ మరోవైపు




హాలియా, డిసెంబర్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులు, ఎన్నికల అధికారులు ఒకవైపు.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు మరోవైపు అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులు లేకుండా బైట తిరిగే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల కంటే పోలీసులు, ఎస్ఐలు ఎక్కువ పనిచేస్తున్నట్లు విమర్శించారు. శనివారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియాలోని లక్ష్మీ గార్డెన్‌లో బీఆర్ఎస్ బలపరచగా ఎన్నికైన 60 మంది నూతన సర్పంచులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కేసీఆర్ కారు గుర్తు వస్తదని.. అది అందరిని తొక్కుకుంటా పోతదన్నారు. ఈ రెండేళ్లలో నియోజకవర్గానికి ఏమీ పని చేశారో జానారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఓట్లా నాడే రాజకీయాలు తర్వాత గ్రామాలు అన్ని తమవే అని భావించి ఆ విధంగానే పరిపాలించినట్లు తెలిపారు. ఇప్పుడు ప్రలోభాలకు పాల్పడుతున్నట్లు దుయ్యబట్టారు. ఇచ్చిన ఇండ్లు కట్టాలి అంటే ఉన్నది అమ్మాలి అనే పరిస్థితి తలెత్తిందన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పెద్ద పెద్ద నాయకులు రెండేళ్ల తర్వాత మీ వెంటే మేము అంటూ బీఆర్ఎస్‌లోకి వస్తారన్నారు.నల్లగొండ జిల్లాలో ఎలక్షన్ అంటే రాజకీయ ఘర్షణలు ఉండేవి. కానీ కేసీఆర్ వచ్చినాక, 60 ఏండ్లు వారు చేయని అభివృద్ధి పదేండ్లలో అభివృద్ధి చేసి చూపించినట్లు తెలిపారు. పేద ప్రజల కోసం కేసీఆర్ ఏమీ చేసిండో అన్ని బంద్ చేసి కమీషన్ పథకాలు మాత్రమే తీసుకొస్తున్నట్లు తెలిపారు. కారు 100 కిలోమీటర్ల వేగంతో వస్తుందని.. చెయ్యి ఖతం అవుతాదని, దుర్మార్గ ప్రభుత్వానికిదే పునాది అని తెలిపారు. కార్యక్రమ ప్రారంభానికి ముందు హాలియా పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ తీశారు.

# తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం

రంగారెడ్డి, డిసెంబరు20 : రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై శనివారం) ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పీవీ ఎక్స్‌ప్రెస్‌వేలోని పిల్లర్ నంబర్ 253 వద్ద మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదంతో అక్కడున్న స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాద ధాటికి వాహనాలు దెబ్బతినగా, పలువురికి గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని అంబులెన్సుల ద్వారా సమీప ఆస్పత్రులకు తరలించారు. గాయాల తీవ్రతపై పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై విచారణ ప్రారంభించారు.ఈ ప్రమాదం కారణంగా పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఉప్పర్‌పల్లి నుంచి ఆరంఘర్ చౌరస్తా వరకు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమంగా క్లియర్ చేస్తూ వాహనాలను మళ్లించేందుకు చర్యలు చేపట్టారు.

# అబద్ధాలు ఆడడంలో నోబెల్ ప్రైజ్ ఇస్తే అది రేవంత్ రెడ్డికే ఇవ్వాలి



సంగారెడ్డి : పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ స్థానాలను కాంగ్రెస్ తన ఖాతాల్లోకి వేసుకుందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. రాజకీయాల్లో అబద్ధాలు ఆడడంలో నోబెల్ ప్రైజ్ ఇస్తే అది రేవంత్‌రెడ్డికే ఇవ్వాలని విమర్శించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో గెలిచిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్ల సన్మాన కార్యక్రమానికి హరీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఎప్పుడైనా లోకల్ బాడీ ఎన్నికల్లో అధికార పార్టీ 90 శాతం గెలిస్తే పది పైసలు ప్రతిపక్ష పార్టీలు గెలుస్తాయి. కానీ బీఆర్ఎస్ 40 శాతం అంటే 4వేలకు పైగా సర్పంచ్ స్థానాలను గెలిచింది. సంగారెడ్డిలో 34 సర్పంచులు గెలిస్తే అందులో 27 గెలిచామని రేవంత్ రెడ్డి చెప్పున్నాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ 50 శాతంలోపే సర్పంచులు గెలిస్తే 66 శాతం గెలిచామని రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నాడని ఆరోపించారు.రేవంత్ రెడ్డి ముఖానికి ఎరువులు ఇచ్చే తెలివి లేదని అన్నారు.పంట పండాలంటే నీళ్లు కావాలి. కరెంటు కావాలి. ఎరువులు కావాలి.రేవంత్ రెడ్డి ఏమంటున్నాడు అప్పులు కావాలి. మ్యాపులు కావాలి అంటున్నాడు.ఎరువు బస్తాలు కావాలంటే యాప్‌లో కొట్టండి అంటున్నాడు. ఎప్పుడైనా నీ మొఖానికి వ్యవసాయం చేసావా? రైతుల కష్టం మీకు తెలుసా? నని ప్రశ్నించారు.కేసీఆర్ హయాంలో కరెంటు ఫుల్. నీళ్లు ఫుల్. ఎరువులు ఫుల్.రేవంత్ రెడ్డి వచ్చినంక రెండుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిండు, కరెంటు 14 గంటలు కూడా వస్తలేదు, ఎరువుల కోసం లైన్ లో నిలబడి గోసపడుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ 10, 12 స్థానాలకు మించి గెలవదని తెలిపారు.ప్రజలందరూ మళ్లీ కేసీఆర్ కావాలని ఎదురుచూస్తున్నారని తెలిపారు.ధైర్యముంటే కో ఆపరేటివ్ ఎన్నికలు జరపాలి .మున్సిపాలిటీల పదవి కాలం పూర్తయి సంవత్సరమవుతున్నా ఎన్నికలు పెట్టట్లేదు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎందుకు పెట్టట్లేదని ప్రశ్నించారు.కోపరేటివ్ ఎలక్షన్ పెట్టమంటే కూడా కాంగ్రెస్ నాయకులను నామినేట్ చేసుకుందామని జీవో ఇచ్చారని హరీష్ రావు వెల్లడించారు. ధైర్యముంటే, రైతులకు మేలు చేసే నాయకుడివి అయితే నామినేటేడ్ కాకుండా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.15వ ఆర్థిక సంఘం డబ్బులు 85 శాతం ఢిల్లీ నుంచి గల్లికే వస్తాయని ఎవరూ కూడా దానిని ఆపలేరని తెలిపారు. ఏ ప్రజాప్రతినిధికి లేని చెక్ పవర్ సర్పంచ్‌కు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. గెలిచిన సర్పంచులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి సర్పంచ్ విధివిధానాలు, బాధ్యతలపై ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేస్తామన్నారు.

# సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోయామని ఫ్రస్టేషన్

ఆదిలాబాద్ జిల్లా:సర్పంచ్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ నాయకులు బరితెగిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలుచోట్ల గెలిచిన అభ్యర్థులపై దాడులకు దిగగా.. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థి కుటుంబసభ్యులు ఏకంగా ఎడ్లబండిని అడ్డంపెట్టి రోడ్డునే మూసివేశారు. అంతటితో ఆగకుండా నచ్చజెప్పేందుకు వచ్చిన పోలీసులపైనా దాడికి తెగబడ్డారు.వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం చిన్న బుగ్గారం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి చంద్రకళపై బీఆర్ఎస్ అభ్యర్థి ఉజ్వల్ యాదవ్ గెలిచాడు. దీంతో చంద్రకళ భర్త, ఆమె కుటుంబసభ్యులు ఓటమిని జీర్ణించుకోలేకపోయారు. తమను ఓడించిన గ్రామస్తులపై కక్షతో తమ ఇంటి ముందు దారికి అడ్డంగా ఎడ్లబండిని పెట్టి రోడ్డును మూసివేశారు. అటువైపు నుంచి ఎవరూ వెళ్లకూడదని తీర్మానం చేశారు.

# చల్వాయి జిల్లా పరిషత్ స్కూల్ లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



చర్చ, గోవింద రావు పేట్, డిసెంబర్ 20:జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చల్వాయి లో ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా జరిగింది. ఇట్టి ఫుడ్ ఫెస్టివల్లో విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ఇట్టి ఫుడ్ ఫెస్టివల్ లో సుమారు 45 రకాల వంటకాలు స్వీయ అనుభవంతో తయారు చేసుకొని ,మరికొందరు చేయించుకుని వచ్చారు.

ఇలాంటి ఫుడ్ ఫెస్టివల్ ద్వారా పిల్లల్లో రకరకాల వంటకాల్లో ఏ పోషక విలువలు ఉంటాయి. అని ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకొని , వాటికి సంబంధించిన జ్ఞానాన్ని పొందారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గోవిందరావుపేట మండల విద్యాధికారి దివాకర్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మరియు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల పనితీరుపై నివేదిక ఇవ్వాల్సిందే



హైదరాబాద్, డిసెంబర్ 20: రాష్ట్రంలో వైద్య విద్య ప్రమాణాల పెంపు, పరిశోధనలకు పెద్దపీట వేస్తూ వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్యను పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ కాలేజీల పనితీరుపై ఎంసీఎంసీ కమిటీలు ఇకపై ప్రతి నెలా నివేదికలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే విద్యార్థులకు భాషాపరమైన ఇబ్బందులు లేకుండా 'స్పోకెన్ ఇంగ్లీష్'లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.ఎంబీబీఎస్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ క్లాసులు నిర్వహించడంతో పాటు, ఇందు కోసం ప్రత్యేక టీచర్ల నియామకానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటా విద్యార్థుల నుంచి హాస్టల్, మెస్ పేరుతో అదనపు ఫీజుల వసూళ్లపై నిఘా పెంచాలని ఆదేశించారు. అలాగే ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు, యాజమాన్యాల తీరుపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెడికోల ఆత్మహత్యల నివారణకు కాలేజీల్లో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.పెరిగిన కాలేజీలకు అనుగుణంగా కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ పటిష్టం చేయడంతో పాటు సిబ్బంది పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా హెల్త్ యూనివర్సిటీ సేవలను వేగవంతం చేసేలా కార్యకలాపాలన్నీ పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీలు, స్కిల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహా సూచనలు చేశారు.

## ప్రతిష్టాత్మకంగా 'ముస్తాబు' నిర్వహిస్తాం: మంత్రి డీబీవీ స్వామి



**ప్రకాశం, డిసెంబరు20 :** ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్‌లో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ) సూచించారు. శనివారం) పొన్నలూరులో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ పి. రాజబాబు పాల్గొన్నారు. గ్రామంలో రూ. 65 లక్షల విలువైన రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి డీబీవీ స్వామి మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని నిర్మించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించేందుకు ఏపీ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ముస్తాబు కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముస్తాబు కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలో సీఎం చంద్రబాబు లాంఛనంగా ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పుకొచ్చారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు నరమేధమే విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



**విశాఖపట్నం, డిసెంబరు20 :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై భారతదేశం అంతటా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనలు మానవ హక్కుల ఉల్లంఘనగా భావిస్తూ వివిధ వర్గాలు గట్టిగా నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా సామాన్య ప్రజల నుంచి రాజకీయ నాయకుల వరకు పలువురు ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నారు. హిందువులపై జరుగుతున్న హింసను అరికట్టాలని, బాధితులకు రక్షణ కల్పించాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందించారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఘటనలను తప్పుబట్టారు. అక్కడ హిందువులపై జరుగుతున్న దాడులను 'నరమేధం'గా అభివర్ణిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న నరమేధంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం హిందువుల మీద జరుగుతున్న దాడులు నరమేధాన్ని ఖండించని వారు భారతీయులేనా? అని ప్రశ్నించారు. ఈ దాడులపై ఖండించని వారికి రాజకీయ పార్టీలకు భారతదేశంలో ఉండే నైతిక హక్కు ఉందా? అని నిలదీశారు. వీటిని ఖండించలేని వారిని మనమే దేశం నుంచి బహిష్కరిస్తామని విజయసాయిరెడ్డి హెచ్చరించారు. మొత్తంగా బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల అంశం భారత దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ ఘటనలపై మౌనం వహించడం దేశానికి, మానవత్వానికి ద్రోహమని విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో భావోద్వేగాలను రేకెత్తిస్తున్నాయి.

## తిరుమల అతిథి గృహంలో కోడిగుడ్లు చికెన్ చూశా

**తిరుమల:** తిరుమలలోని ఓ విశ్రాంతిగృహంలో తాను కోడిగుడ్లు, చికెన్ ఉన్నట్టు గుర్తించానని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ ఓ వైసీపీ నేత విడుదల చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'శ్రీనివాస్ నాయక్ అనే నేను వైసీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిని. 17వ తేదీన తిరుమలలోని కౌస్తుభం విశ్రాంతి భవనంలో 538 నెంబరు గదిని అద్దెకు తీసుకున్నా. అక్కడికి



వెళ్లే సమయంలో పారిశుధ్య కార్మికులు గదిని శుభ్రపరిచి చికెన్, కోడిగుడ్లు ఉన్న ఓ కవర్‌ను బయట పడేయడాన్ని గుర్తించా. లడ్డూలో కల్తీ జరిగిందని నానా రోత చేసిన సీఎం, డిప్యూటీ సీఎం, టీటీడీ చైర్మన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి. ఈ విషయాన్ని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా' అని ఆ వీడియోలో పేర్కొన్నారు. అయితే, ఆ వీడియోలో కోడిగుడ్లు కానీ, చికెన్ కానీ కనిపించకపోవడం గమనార్హం. 538 గదిలోకి కొందరు యాత్రికులు నిషేధిత వస్తువులైన కోడి గుడ్లను తెచ్చినట్టు తమ దృష్టికి వచ్చిందని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ శుక్రవారం రాత్రి ఓ ప్రకటన ద్వారా స్పందించింది. కోడిగుడ్లను తెచ్చిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేసింది.

## ప్రైవేట్ కొరియర్ సర్వీసులకు ధీటుగా పోస్టాఫీసులు



**అమరావతి, డిసెంబర్ 20:** రైల్వే తర్వాత అత్యధికంగా పోస్టల్ శాఖలో 4.50 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం నాడు విట్ యూనివర్సిటీలో జెన్ జెడ్ పోస్టాఫీసును కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. పోస్టల్ శాఖ ఉద్యోగులందరినీ సమర్థవంతంగా ఉపయోగించుకుంటే దేశంలోనే పటిష్టమైన శాఖగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ నిలుస్తుందన్నారు. లేటెస్ట్ టెక్నాలజీ రావడం వల్ల ఎక్కడెక్కడ ఏం జరుగుతుందో సులభంగా తెలుస్తోందని తెలిపారు. కేవలం లెటర్స్ బట్వాడాకే పరిమితం కాకుండా కాకుండా ఈ కామర్స్ ప్లాట్ ఫాంగా మార్చామని చెప్పారు. ప్రతి ఉద్యోగి తమ విధులు సజావుగా నిర్వహించేలా చూస్తున్నామన్నారు. సాంకేతికత సాయంతో ప్రైవేట్ కొరియర్ సర్వీసులకు ధీటుగా పోస్టాఫీసులను తయారు చేస్తున్నామని తెలిపారు. మార్కెటింగ్ కోసం ఓ నిపుణుడిని ప్రత్యేక అధికారిని నియమించామని.. మానవ వనరులను సక్రమంగా వాడుకోవడంపై దృష్టి సారించామని అన్నారు. జెన్ జెడ్ పోస్టాఫీసు ఏర్పాటు లక్ష్యం యువతను ప్రభుత్వ వ్యవస్థలో భాగస్వామ్యులను చేయడమే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మూడు జెన్ జెడ్ పోస్టాఫీసులు ఏర్పాటు చేశామని.. దేశ వ్యాప్తంగా దాదాపు 50 జెన్ జెడ్ పోస్టాఫీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోస్టల్ శాఖలో పెట్టే ఖర్చులతో 89 శాతం జీతాలకు సరిపోతున్నాయన్నారు. సామాజిక బాధ్యతగా చేసే కార్యక్రమాల వల్ల తాము ఎక్కువ చార్జీలు వసూలు చేయటం లేదని.. అందుకే ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు ఆలోచిస్తున్నామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారి యా, పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ అక్రమాస్తుల కేసులో ఊహించని పరిణామం




**హైదరాబాద్, డిసెంబరు 20:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టులో కీలక మార్పులు జరగడంతో విచారణ మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటివరకు ఈ కేసు అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్నప్పటికీ, తుది దశకు చేరుకోకపోవడం రాజకీయ, న్యాయవర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. తాజాగా నాంపల్లి సీబీఐ కోర్టు న్యాయాధికారి రఘురాం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త న్యాయాధికారిగా పట్టాభిరామారావును నియమించారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుత న్యాయాధికారి ఈ నెల 22 తర్వాత రిలీవ్ కావాలని, 29వ తేదీ లోగా నూతన వ్యక్తి పోస్టింగ్‌లో చేరాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మార్పుతో జగన్ అక్రమాస్తుల కేసు విచారణను మరోసారి కొత్త న్యాయాధికారి ప్రారంభించనున్నారు. జగన్ అక్రమాస్తుల కేసులో గతంలో కూడా పలుమార్లు న్యాయాధికారులు మారడంతో విచారణ ప్రతిసారి మొదటి నుంచి ప్రారంభమవుతోందన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా డిశ్చార్జ్ పిటిషన్ల విచారణ ఇప్పటికీ పూర్తికాకపోవడం గమనార్హం. ఏళ్ల తరబడి కేసు కొనసాగుతున్నా, ప్రధాన కేసులు ట్రయల్ దశకు వెళ్లకుండా నిలిచిపోయాయి. దీనికి కారణం పదేపదే డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేయడమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన కేసుల విచారణకు వెళ్లకుండా అడ్డుకునేందుకు జగన్ తరపున వ్యూహాత్మకంగా డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారని న్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ కారణంగా కేసు ముందుకు సాగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మరోవైపు, ఈ కేసు త్వరితగతిన విచారించి తీర్పులు వెల్లడించాలని గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ ఆదేశాలు అమల్లోకి రాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. న్యాయాధికారుల మార్పు, డిశ్చార్జ్ పిటిషన్లపై దీర్ఘకాల విచారణ వంటి అంశాల వల్ల జగన్ అక్రమాస్తుల కేసు ఎప్పటికప్పుడు ఆలస్యం అవుతూనే ఉంది. ఈ పరిస్థితి న్యాయవ్యవస్థపై ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తోంది. రాజకీయంగా కూడా ఈ కేసు ఎప్పుడు ముగుస్తుందన్న అంశం కీలకంగా మారింది. కొత్త న్యాయాధికారి పట్టాభిరామారావు బాధ్యతలు చేపట్టిన తర్వాత అయినా విచారణ వేగవంతమవుతుందా? ప్రధాన కేసులు ట్రయల్‌కు వెళ్లే అవకాశముందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొత్తంగా జగన్ అక్రమాస్తుల కేసులో జాప్యం అవుతోండటంతో న్యాయ ప్రక్రియపై, కేసు భవితవ్యంపై రాజకీయ, సామాజిక వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## జీరాంజీ బిల్లుతో పేదలకు లాభం లేదు



**విజయవాడ, డిసెంబర్ 20:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీరాంజీ బిల్లు వల్ల పేదలకు ఎటువంటి ఉపయోగమూ లేదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. గతంలో ఉన్న ఉపాధిహామీ చట్టాన్ని రద్దుచేసి కొత్తగా జీరాంజీ పథకాన్ని తీసుకొచ్చారని కేంద్ర ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. దీనిలో కార్మికులకు గానీ, రాష్ట్రాలకు గానీ ఎటువంటి హక్కులూ లేవన్నారు. గతంలో కనీసం 100 రోజులు పని పేరుతో 50 రోజులన్నా కార్మికులకు ఉపాధి లభించేదని.. ఇప్పుడు కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఉండేలా చేశారని విమర్శించారాయన. ఉపాధి హామీ పథకం వ్యవసాయ పనులకు ఆటంకమని చెబుతున్నారని.. అలాంటిదేమీ లేదని అనేక నివేదికలు, పరిశోధనలు బయటపెట్టాయని రాఘవులు తెలిపారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల శ్రమను కార్పొరేట్లు దోచుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారాయన. పథకంలో నిధుల వాటా గతంలో కేంద్రానికి 90 శాతం రాష్ట్రానికి 10 శాతం వాటా ఉండేదని.. కానీ, ఇప్పుడు 60:40 శాతంగా మార్చి, రాష్ట్రాలపై భారం మోపుతున్నారని కేంద్ర ప్రభుత్వం తీరును ఎండగట్టారాయన. ఆకలిచావులు, వలసలు నివారించేందుకు ఉపయోగపడిన ఈ చట్టాన్ని రద్దు చేయడం వల్ల మళ్లీ ఆకలిచావులు పెరిగే ప్రమాదం ఉందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారుఈ పథకానికి నిధుల కేటాయింపు డిమాండ్‌ను బట్టి కాకుండా.. రాజకీయ అవసరాలకు తగిన విధంగా కేటాయించేలా నిబంధనలు రూపొందించారని రాఘవులు విమర్శించారు. గతంలో కేంద్రం ముందుగానే నిధులు ఇచ్చేదని.. ఇప్పుడు పనిచేసిన తరువాత బిల్లు ఇచ్చేలా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఉపాధి కల్పనలో ఆలస్యమయితే గతంలో కేంద్రమే పెనాల్టీ చెల్లించేదని.. ఇప్పుడు ఆ బాధ్యతను రాష్ట్రం మీదకు నెట్టేశారని వివరించారు. ఈ అంశంపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి మాట్లాడటం లేదని, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కూడా గట్టిగా ప్రశ్నించడం లేదని రాఘవులు విమర్శించారు. సెలక్టు కమిటీకి పంపించాలని చెప్పి వైసీపీ చేతులు ముడుచుకు కూర్చుందని.. ఈ రెండు పార్టీలు మోడీని చూసి భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలు మోడీతో అనుసరిస్తున్న తీరువల్ల రాష్ట్రానికి తీవ్రనష్టం వాటిల్లుతుందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమకు అనువుగా ఉండేలా పారిశ్రామిక పాలసీని మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాఘవులు డిమాండ్ చేశారు.

## అమరావతికి ఐకానిక్ కళ కృష్ణానదిపై 6 లేన్ల అద్భుతం




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దేశంలోని ప్రధాన నగరా లతో అనుసంధానంపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఫోకస్ పెట్టారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో కూడిన గ్రీన్ ఫీల్డ్ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ంలోని జాతీయ రహదారుల నెట్‌వర్క్ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీలో ప్రధానంగా కృష్ణానదిపై ప్రతిపాదించిన 6 లేన్ల ఐకానిక్ కేబుల్ స్టెడ్ వంతెన నిర్మాణంపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చర్చించారు. రాజధాని అమరావతికి తలమానికంగా నిలిచే ఈ ఐకానిక్ వంతెన నిర్మాణ బాధ్యతను జాతీయ రహదారుల సంస్థ చేపట్టాలని సీఎం చంద్రబాబు కోరారు. మూలపాడు వద్ద నిర్మించే ఈ వంతెన ద్వారా అమరావతిని మూడు కీలక జాతీయ రహదారులతో అనుసంధానించవచ్చని వివరించారు. విజయవాడ-హైదరాబాద్, చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారులతో పాటు తీరప్రాంత రోడ్ కారిడార్‌ను ఈ వంతెన నేరుగా కలుపుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్ %-% అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవేహైదరాబాద్ నుండి అమరావతి వరకు ప్రతిపాదించిన గ్రీన్ ఫీల్డ్ హైవే గురించి గడ్కరీతో సీఎం చర్చించారు. ఈ హై-స్పీడ్ యాక్సెస్ కంట్రోల్ రోడ్డు అందుబాటులోకి వస్తే రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని స్పష్టం చేశారు. అమరావతిని నేషనల్ హైవే గ్రిడ్‌లో ఒక మొబిలిటీ కేంద్రంగా, లాజిస్టిక్స్ నోడ్‌గా మార్చడమే తమ లక్ష్యమని సీఎం వెల్లడించారు. ఆర్థిక ప్రగతికి రహదారులే సూచిక దేశంలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణలో నితిన్ గడ్కరీ చేస్తున్న కృషిని చంద్రబాబు ఈ సందర్భంగా కొనియాడారు. ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తోందన్నారు సీఎం. త్వరలో అనకాపల్లి జిల్లాలో ఆర్సీలార్ మిట్టల్‌తో స్టీల్ సిటీ ఏర్పడుతుందని వెల్లడించారు. అల్యూమినియం సిటీ కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. మెడికల్ కాలేజ్‌లకు పీపీపీ కింద ఇచ్చామన్న సీఎం.. గతంలోనూ 104, 108లు ప్రైవేట్‌కే ఇచ్చారు కదా? ప్రశ్నించారు. రుషికొండను గుండు కొట్టారని విమర్శించారు. రుషికొండకు రూ. 500 కోట్లు ఖర్చు చేశారని.. ఆ సొమ్ములతో మెడికల్ కాలేజ్ కట్టొచ్చన్నారు. వైసీపీ హయాంలో ఏజెన్సీని గంజాయి వనంగా మారిస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చి కాఫీవనంగా మార్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు .రహదారుల అభివృద్ధి కేవలం కనెక్టివిటీ మాత్రమే కాకుండా, ప్రాంతాల ఆర్థిక ప్రగతికి బలమైన పునాదులు వేస్తాయని ఆయన అభిప్రాయ పడ్డారు. అమరావతిని జాతీయ రహదారులతో ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా అనుసంధానించడం ద్వారా రాజధాని అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరగా, దీనిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

## అలిపిరి చెక్ పోస్ట్ వద్ద సెక్యూరిటీ లగేజీ స్కానర్ కోసం టీటీడీకి రూ.38 లక్షలు విరాళం




**తిరుమల :** అలిపిరి చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేయనున్న సెక్యూరిటీ లగేజీ స్కానర్ కోసం ఇండియన్ బ్యాంక్ రూ. 37,97,508 టీటీడీకి విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుమల లోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరికి ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ మేనేజర్ ప్రణేశ్ కుమార్ విరాళం డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం. సెల్వరాజ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఇందిరా, తిరుమల బ్రాంచ్ మేనేజర్ రాఘవేంద్ర పాల్గొన్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.31 కోట్లుతిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.31 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 64,729 మంది భక్తులు దర్శించుకోగా 22,162 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

## పొరపాట్లు జరిగితే సరిదిద్దుకుంటాం: మంత్రి నాదెండ్ల



**కృష్ణా, డిసెంబర్ 20:** జిల్లాలోని తోట్లవల్లూరు మండలంలో మంత్రి నాదెండ్ల మనోహర్ (శనివారం) పర్యటించారు. పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజాతో కలిసి తోట్లవల్లూరు గ్రామంలోని రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోత కోసి కుప్ప నూర్పుడి చేస్తున్న రైతులు.... కల్లాల్లో ధాన్యం ఆరబోసిన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతు సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని తెలిపారు. రైతుకు మేలు జరగాలని కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. పొరపాట్లు జరిగితే సరిదిద్దుకుంటామని.. అవి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా నేటి వరకు 28లక్షల34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని తెలిపారు. సంక్రాంతి కల్లా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఎప్పటికప్పుడు రైతాంగ సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. రికార్డు స్థాయిలో కృష్ణా జిల్లాలో మొట్టమొదటిసారి 11 ట్రైన్లు పెట్టి ధాన్యం ఇతర జిల్లాలకు తరలించారని తెలిపారు. జిల్లాలో మిల్లుల సామర్థ్యం తక్కువగా ఉండడంతో రాష్ట్రంలో 106 మిల్లుల నిర్వాహకులు కృష్ణాజిల్లాలో ధాన్యం కొనుగోలు చేసేలా వేసులుబాటు కల్పించామని చెప్పారు. భారీ ఎత్తున జరిగిన ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని రైతాంగాన్ని వివరించాలని ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. ధాన్యం రైతులు ప్రభుత్వానికి అమ్మితే కనీస మద్దతు ధర తప్పక అందుతుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలులో రైతుకు సహాయంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని అన్నారు. 24 గంటల్లోపే విక్రయించిన ధాన్యం నగదును రైతు ఖాతాలో జమ చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో.. 97,37,832 ఓటర్ల తొలగింపు



**చెన్నై:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తర్వాత విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా నుండి 97,37,832 మందిని తొలగించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ఉత్తర్వుల మేరకు శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.సర్ పనులు ప్రారంభించక ముందు 6,41,14,587 మంది ఓటర్లుండేవారని, ముసాయిదా ఓటరు జాబిదాలో 5,43,76,755 మంది ఉన్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 97,37,832 మంది ఓటర్లను తొలగించామని, సర్ ఫారాలు తిరిగి సమర్పించని వారు, కొత్తగా ఓటరు జాబితాలో చేరవచ్చన్నారు. ఇందు కోసం బూత్ కమిటీల ద్వారా రెండు వారాల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఓటరు జాబితాలో కొత్తగా చేరదలుచుకున్నవారు శుక్రవారం నుండి జనవరి 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.రాష్ట్రంలో.రాష్ట్రంలో మొత్తం 6కోట్ల41లక్షల 14వేల 587 మంది ఓటర్లలో, 6కోట్ల41లక్షల, 13వేల 773 మందికి దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. వాటిలో 6కోట్ల41లక్షల 13వేల 221 ఫారాలు పూర్తిచేసి ఈసీకి సమర్పించారు. ఈ వివరాలతో రూపొందించి విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, కార్పొరేషన్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయ వెబ్‌సైట్‌ల నుండి డౌన్‌లోడ్ చేసి వీక్షించవచ్చు. మసాయిదా ఓటరు జాబితాలో చిరునామా మారిన వారు ఫారం 8, కొత్తగా చేరదలిచిన వారు ఫారం 6ను పూర్తిచేసి ఈసీ కోరిన ఆధారాలతో సమర్పించి జనవరి 18వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేయించుకోవాలి, ఇక తుది ఓటరు జాబితా ఫిబ్రవరి 17న విడుదలవుతుంది.కాగా.. తెన్‌కాశి జిల్లాలో 1.51లక్షల మంది, వేలూరు జిల్లాలో 2.15లక్షల మంది, కళ్లకురుచ్చి జిల్లా 2.15లక్షల మంది, తంజావూరు జిల్లా 2.06లక్షల మంది, తిరునల్వేలి జిల్లాలో 2.14లక్షల మంది, మైలాడుదురై జిల్లాలో 75.378 మందిని ఓటరు జాబితా నుండి తొలగించారు. అదే విధంగా రాణిపేట 1.40లక్షల మంది, దిండుగల్‌లో 3.20లక్షల మంది, కరూర్ జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో 79,690 మంది, అరియలూరు జిల్లాలో 24,368 మంది ఓటర్లను తొలగించడం గమనార్హం.గ్రేటర్ చెన్నైలో.గ్రేటర్ చెన్నైలో 14.25 లక్షల మంది ఓటర్లను తొలగించారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లులేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు కొత్తగా ఓటరు జాబితాలో చేరవచ్చని ఈసీ హామీ ఇచ్చింది. నగరంలో ఎస్ఐఆర్ ప్రారంభించక ముందు 40,03694 మంది ఓటర్లుండగా, ముసాయిదా ఓటరు జాబితాలో 25,79,676 మంది మాత్రమే ఉండటం గమనార్హం. పాత ఓటరు జాబితాల నుండి 14,20,018 మందిని తొలగించారు. వీరిలో 1.56లక్షల మంది మరణించినవారు కాగా, ఓటరు జాబితాలో ఉన్న చిరునామాలో లేనివారు 27,328 మంది,అలాగే వలస వెళ్లిన వారు 12,22,164 మంది, రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగివున్న వారు 18,772 మంది అని ఈసీ తెలిపింది. నగరానికి చెందిన ముసాయిదా ఓటరను జాబితాలో 13,31,243 మంది మహిళలున్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న కొళత్తూరు నియోజకవర్గంలో 1.03లక్షల మంది ఓటర్లను తొలగించారు. ప్రస్తుతం 1.86లక్షల మంది ఓటు హక్కు కలిగివున్నారు. అలాగే డిప్యూటీ సీఎం ఉదయనిధి నియోజకవర్గం చేపాక్కం-ట్రిప్లికేన్‌లో 89వేల మందిని ఓటరు జాబితా నుండి తొలగించగా, 1.50లక్షల మంది ఓటర్లున్నారు.

# పెను విషాదం రైలు ప్రమాదంలో 8 ఏనుగులు మృతి



**అస్సాం :** అస్సాంలో పెను విషాదం చోటుచేసుకుంది. ఏనుగుల గుంపును రైలు ఢీకొట్టిన ఘటనలో 8 ఏనుగులు ప్రాణాలు కోల్పోగా.. ఓ ఏనుగు పిల్ల తీవ్రంగా గాయపడింది. (శనివారం) ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. శనివారం తెల్లవారుజామున 2.17 గంటల సమయంలో అస్సాంలోని హెజాయ్ ప్రాంతంలో ఏనుగుల గుంపు రైలు పట్టాలు దాటుతూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సాయిరంగ్ - న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు ఆ పట్టాలపై వేగంగా దూసుకువచ్చింది. పట్టాలు దాటుతున్న ఏనుగుల్ని ఢీకొంది. దీంతో 8 ఏనుగులు అక్కడికక్కడే చనిపోయాయి.ఓ ఏనుగు పిల్ల తీవ్రంగా గాయపడింది. గువహటికి 126 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఏనుగులు ఢీకొట్టిన వేగానికి లోకో మోటివ్‌తో పాటు ఐదు కోచులు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఎవ్వరికీ ఏమీ కాలేదు. ఇక, సమాచారం అందుకున్న రైల్వే అధికారులు హుటాహుటిన ప్రమాదం జరిగిన చోటుకు వెళ్లారు. సహాయక చర్యలు మొదలుపెట్టారు. రైలు పట్టాలు తప్పటంతో పాటు ఏనుగుల కళేబరాలు చెల్లా చెదురుగా పడిపోవటంతో ఎగువ అస్సాంతో పాటు పలు ఈశాన్య ప్రాంతాలకు సంబంధించిన రైలు సేవలు నిలిచిపోయాయి. ప్రమాదం జరిగిన ప్రాంతం ఎలిఫెంట్ కారిడార్ కాకపోవటంతో ఈ ఘోరం జరిగినట్లు తెలుస్తోంది. పట్టాలపై ఏనుగుల్ని చూసిన లోకో పైలట్ ఎమర్జెన్సీ బ్రేక్స్ వేశాడు. అయినా కూడా దారుణం జరిగిపోయింది. రైలు ఏనుగుల్ని ఢీకొట్టింది.

# సంప్రదాయ వైద్యంతో అనేక ఆరోగ్య సమస్యల పరిష్కారం




**ఢిల్లీ:** సంప్రదాయ వైద్యం ఆధునిక జగతి ఎదుర్కొంటున్న అనేక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సాయపడగలదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ( డబ్ల్యూహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అదనోమ్ తెలిపారు. సైన్స్, సంప్రదాయ వైద్యం ఒకదాన్ని మరొకటి పరిపూర్ణం చేస్తాయని భారత్ ప్రపంచానికి చాటిందని వెల్లడించారు. ఢిల్లీలో సంప్రదాయ వైద్యంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ శుక్రవారం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ లో టెడ్రోస్ అథనామ్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో భారత్ పై ప్రశంసలు కురిపించారు. ఈ సమ్మిట్?లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా సహా 100 దేశాలకు చెందిన మంత్రులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు. ప్రపంచ స్థాయిలో సాంప్రదాయ వైద్యాన్ని సమర్థించినందుకు ప్రధాని నరేంద్ర మోదీని టెడ్రోస్ అధనోమ్ ప్రశంసించారు. సమకాలీన ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడంలో సాంప్రదాయ వైద్యం తాలుక ఔచిత్యాన్ని హైలైట్ చేశారు. భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 సమావేశంలో ప్రధాని మోదీ సంప్రదాయ వైద్యం గురించి అంతర్జాతీయ స్థాయిలో తెలియజేశారని అన్నారు. ఆ పిలుపే ఇప్పుడు సంప్రదాయ వైద్యానికి అపూర్వమైన అంతర్జాతీయ ప్రతిస్పందనను సృష్టించిందని పేర్కొన్నారు. 'ఒకే భూమి, ఒకే ఆరోగ్యం' అనే ప్రధాని మోదీ దార్శనికత సాంప్రదాయ వైద్యం ప్రధాన సూత్రాలతో ఏకీభవిస్తుందని తెలిపారు. 'సంప్రదాయ వైద్యంతో ఆరోగ్య సమస్యలు పరిష్కారం' "సంప్రదాయ వైద్యం నేటి ఆధునిక జగతి ఎదుర్కొంటున్న అనేక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సాయపడుతుంది. అలాగే ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడుతుంది. సంప్రదాయ వైద్యం, ఆవిష్కరణలు కలిసి ముందుకు సాగగలవని భారత్ చూపించింది. ఆధునిక విజ్ఞాన శాస్త్రం, సంప్రదాయ విజ్ఞానం ఒకదాన్ని మరొకటి పరిపూర్ణం చేస్తాయని భారత్ ప్రపంచానికి చాటి చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం ఈ దార్శని కతను ప్రపంచం ముందుకు తీసుకురావడంలో సహాయపడింది. ఢిల్లీ డిక్లరేషన్ ను ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నాను. సాంప్ర దాయ వైద్యం గతానికి సంబంధించినది కాదు. ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు కేంద్రంగా మారుతున్న ఒక సజీవ, అభివృద్ధి చెందుతున్న శాస్త్రం అని భారత్ స్పష్టంగా నిరూపిం చింది. సాంస్కృతిక వారసత్వం, మేధో సంపత్తిన్ని గౌరవిస్తూ జీవవైవిధ్యం, సాంప్రదాయ వైద్యాన్ని కాపాడటానికి మేము కృషి చేస్తాం" అని టెడ్రోస్ అధనోమ్ వ్యాఖ్యానించారు. భారత్, డబ్ల్యూహెచ్‌ఓ మధ్య పెరుగుతున్న బంధానికి ప్రతీకగా ఢిల్లీలో కొత్తగా నిర్మించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియా ప్రాంతీయ కార్యాలయ కాంప్లెక్స్ ను ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. గుజరాత్ లోని జామ్ నగర్ లో డబ్ల్యూహెచ్‌ఓ గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్ స్థాపించారు. ఈ విషయంపైనా టెడ్రోస్ అధనోమ్ స్పందించారు. ఈ ప్రయత్నాలు సాంప్రదాయ వైద్యాన్ని ఆరోగ్య వ్యవస్థలు, పరిశోధనలతో అనుసంధానించడానికి సహాయపడ్డాయని పేర్కొన్నారు.అలాగే 'డబ్ల్యూహెచ్‌ఓ గ్లోబల్ సమ్మిట్ ఆన్?ట్రెడిషనల్ మెడిసిన్' శిఖరాగ్ర సమావేశానికి హాజరైన టెడ్రోస్ అధనోమ్?తో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ క్రమంలో సాంప్రదాయ వైద్యం తాలుక అపారమైన సామర్థ్యం గురించి టెడ్రోస్ అధనోమ్?కు మోదీ తెలియజేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మోదీ ఎక్స్ లో పోస్ట్ చేశారు. "డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రేయేసస్ తో ఫలప్రదమైన చర్చ జరిగింది. సంపూర్ణ ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించడంలో సంప్రదాయ వైద్యం తాలుక అపారమైన సామర్థ్యం గురించి మేము చర్చించాం" అని మోదీ ఎక్స్ పోస్ట్?లో పేర్కొన్నారు.ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మోదీ సంప్రదాయ వైద్యం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. సంప్రదాయ వైద్యానికి దక్కాల్సిన గుర్తింపు లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విజ్ఞానశాస్త్రం ద్వారా విశ్వాసాన్ని పెంపొందించి, సంప్రదాయ వైద్యం పరిధిని విస్తరించాలని వెల్లడించారు. పరిశోధనల బలోపేతంతో పాటు డిజిటల్ టెక్నాలజీ వినియోగం వల్ల సంప్రదాయ వైద్యానికి మరింత ప్రాచుర్యం లభిస్తుందని స్పష్టం చేశారు. ఆయుర్వేదంలో సమ స్థితిని ఆరోగ్యానికి పర్యాయపదంగా పరిగణిస్తారని అన్నారు.

# గవర్నర్ రవి సంచలన కామెంట్స్



**చెన్నై:** రాష్ట్రం ఆత్మహత్యలకు రాజధానిగా మారుతోందని, జాతీయ నేరగణాంకాలను బట్టి ప్రతియేటా ఈ రాష్ట్రంలో 20 వేల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని గవర్నర్ ఆర్ఎన్ రవి( ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయిలో జాతి,, మత విద్వేషాల కారణంగా పలు యుద్ధాలు జరుగుతున్నాయని, మానవులు మానసిక ఒత్తిడుల కారణంగా, వేర్పాటువాదంవల్ల ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నా రు. కోయంబత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో శుక్రవారం ఉదయం 'సింధూ సరస్వతి నాగరికత మహానాడు' ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజుకు 65 మంది చొప్పున ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు.ఆత్మహత్యలను నిరోధించడానికి మానవుల జీవితాలను మెరుగుపరచడంతోపాటు దేశ సంస్కృతీ సంప్రదయాలు, ఆచరిస్తున్న సిద్ధాంతాలు గురించి ఎలుగెత్తి చాటాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్యులు, ద్రావిడులని ప్రజల్లో విబేధాలను సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వారిప్రయత్నాలు ఎన్నటికీ సఫలం కావని, కారణం వారి వద్ద అసత్యాలతో ఆచరణకు సాధ్యం కాని సిద్ధాంతాలే ఉన్నాయని గవర్నర్ చెప్పారు.

# హిందూ వ్యక్తి హత్యపై బంగ్లాదేశ్ సీరియస్




**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లో అరాచక శక్తులు రెచ్చిపోతున్నాయి. మతపరమైన ఆరోపణల సాకుతో సామాన్యులపై జరుగుతున్న దాడులు ఆ దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయంగా దిగజార్చుతున్నాయి. ఇటీవల 25 ఏళ్ల దీపు చంద్రదాస్ అనే హిందూ యువకుడిని "ఇస్లాంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడన్న" నెపంతో నిరసనకారులు క్రూరంగా కొట్టి చంపిన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ అమానుష కాండపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమ వ్వడంతో.. ఎట్టకేలకు యూనస్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.ఏడుగురి అరెస్ట్.. ప్రభుత్వం సీరియస్ దీపూ చంద్రదాస్ హత్య కేసులో ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు అధికారికంగా ప్రకటించారు. "మా పాలనలో మూక దాడులకు తావులేదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారికి కఠిన శిక్షలు తప్పవు" అని ఆయన హెచ్చరించారు. అల్లర్లపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేశామని, ప్రజలందరూ సంయమనం పాటించాలని కోరారు. అయితే క్షేత్రస్థాయిలో హిందువులపై జరుగుతున్న దాడులు ఇంకా ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి.భారతీయులకు హైకమిషన్ అప్రమత్తతబంగ్లాదేశ్‌లో పరిస్థితులు ఇంకా అదుపులోకి రాకపోవడంతో అక్కడి భారత హైకమిషన్ కీలక సూచనలు చేసింది. బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని హెచ్చరించింది. స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు విద్యార్థుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన యువనేత షరీఫ్ ఉస్మాన్ హాదీ మృతితో రాజధాని ఢాకాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. శనివారం ఆయన అంత్యక్రియల సందర్భంగా భారీ ఎత్తున నిరసనకారులు గుమిగూడారు.ఇదీ చూడండి: బంగ్లాదేశ్‌లో హిందూ నేత కిడ్నాప్, దారుణ హత్య.. తీవ్రంగా స్పందించిన భారత్

# పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 ఏళ్ల జైలు శిక్ష



**పాకిస్థాన్ :** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అతని భార్య బుష్రా బీబీ(కు ఊహించని షాక్ తగిలింది. తొషఖానా - 2 అవినీతి కేసులో ఫెడరల్ ఇన్వేస్టిగేషన్ ఏజెన్సీ ప్రత్యేక కోర్టు ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ శనివారం తీర్పునిచ్చింది. ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ ఉన్న రావల్పిండిలోని అడియాలా జైలోనే విచారణ జరిపిన న్యాయస్థానం ఈ తీర్పులు వెలువరించడం గమనార్హం. 2021 మే నెలలో సౌదీలో ఇమ్రాన్ పర్యటించారు. 2021 మే నెలలో సౌదీ అరేబియా పర్యటించిన సందర్భంగా యువరాజు ఇమ్రాన్ ఖాన్ దంపతులకు ఖరీదైన 'బల్గరి' నగల సెట్ ను బహుమతి()గా అందజేశారు.ప్రభుత్వ ఖాజానాకు (తోషఖానా)కు అప్పగించకుండా ఇమ్రాన్ అతని భార్య బుష్రా సొంత ప్రయోజనం కోసం తక్కువ ధరకు విక్రయించినట్లు వచ్చిన ఆరోపణపై కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి షారుఖ్ అర్జు మంద్ ఈ సంచలన తీర్పు ప్రకటించారు. ప్రధాని హూదాలో ఉంటూ నమ్మకద్రోహానికి పాల్పడి నందుకు పాకిస్థాన్ పీనల్ కోడ్ సెక్షన్ 409 కింద 10 ఏళ్లు కఠిన శిక్ష, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద 7 ఏళ్లు సాధారణ శిక్ష విధించారు. అంతేకాదు దంపతులకు చెరో రూ.16.4 మిలియన్ జరిమానా కూడా విధించారు. ఈ తీర్పుతో ఇమ్రాన్ ఖాన్ మరో పదేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం పోయింది.ఈ తీర్పును హై కోర్టులో సవాలు చేస్తామని ఇమ్రాన్ ఖాన్ తరుపు న్యాయవాది తెలిపారు.

# మేమిద్దరం వెళ్తాం ఢిల్లీ పర్యటనపై డీకే



**బెంగళూరు:** అధికార మార్పిడి అంశంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య అంతరం పెరుగుతోందంటూ ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చర్చల కోసం ఎప్పుడు పిలిచేది కాంగ్రెస్ అధిష్ఠానం తమ ఇద్దరికీ చెప్పిందని అన్నారు. అధిష్ఠానం ఎప్పుడు పిలిస్తే అప్పుడు ఇద్దరూ వెళ్తామని తెలిపారు.పార్టీ అధిష్ఠానాన్ని కలిసేందుకు ఇద్దరు నేతలు వెళ్లే అవకాశం ఉందా అని అడిగినప్పుడు డీకే నవ్వుతూ సమాధానమిచ్చారు. మీడియాకు తప్పనిసరిగా చెబుతానని, ఏదీ దాచిపెట్టనని అన్నారు. సరైన సమయంలో ఢిల్లీకి పిలుస్తామని అధిష్ఠానం పెద్దలు తమ ఇద్దరికి ఫోన్ చేసి చెప్పారని, పిలుపు ఎప్పుడు వస్తే అప్పుడు ఇద్దరూ వెళ్తామని తెలిపారు. ముఖ్యమంత్రి పదవిలో తాను కొనసాగుతానని అసెంబ్లీలో సిద్ధరామయ్య తాజాగా ప్రకటించిన నేపథ్యంలో డీకే ఈ వ్యాఖ్యలు చేశారు.ఉత్తర కర్ణాటక అభివృద్ధి పనుల అంశంపై సిద్ధరామయ్య శుక్రవారంనాడు అసెంబ్లీలో మాట్లాడుతూ, తన పదవీకాలం రెండున్నరేళ్లకే పరిమితమని తాను ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. అధిష్ఠానం తనను ఐదేళ్లూ పదవిలో కొనసాగిస్తుందని అనుకుంటున్నట్టు చెప్పారు. 'మీ హయాంలో నార్త్ కర్ణాటకకు ఇచ్చిన హామీలు నెరవేరుతాయా?' అని బీజేపీ ఎమ్మెల్యే ఒకరు అడిగిన ప్రశ్నకు స్పందనగా సీఎం ఈ సమాధానం ఇచ్చారు.సీఎం పదవిపై సిద్ధరామయ్య క్లారిటీ ఇచ్చారు. ఇదే సమయంలో డీకే శివకుమార్ పుణ్యక్షేత్రాలను సందర్శించడం అందరి దృష్టిని ఆకర్షించింది. అమావాస్య వేళ అమ్మవారి ఆలయాలను డీకే శివకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం పదవిపై సిద్ధరామయ్య వ్యాఖ్యలపై స్పందించారు డీకే శివకుమార్. తనకు , సిద్ధరామయ్యకు మధ్య ఎలాంటి అభిప్రాయభేదాలు లేవన్నారు.కర్ణాటకలో కాంగ్రెస్ వ్యవహారాలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. సిద్ధరామయ్య , డీకే శివకుమార్ ఆధిపత్య పోరుతో కర్ణాటకలో అభివృద్ధి కుంటుపడిందన్నారు కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి. కర్నాటక వ్యవహారాలపై కాంగ్రెస్ హైకమాండ్ పట్టు కోల్పోయింది అన్నారు. అందుకే సిద్ధరామయ్య రోజుకో తీరుగా మాట్లాడుతున్నారని అన్నారు. "కాంగ్రెస్ దగ్గర ఇప్పుడు కమాండ్ లేదు. కమాండ్ లేనప్పుడు నిర్ణయం రాదు. తానే సీఎం అవుతానని డీకే శివకుమార్ చెబుతారు.. నవంబర్ , డిసెంబర్ లోనే పగ్గాలు చేపట్టాలి.. కాని కాస్త ఆలస్యమయ్యిందని చెబుతారు. ఇద్దరు కలిసి బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ చేస్తారు.. ఎలాంటి అభిప్రాయభేదాలు లేవని అంటారు. హైకమాండ్ దగ్గర చెప్పడానికి ఏమి లేదు" అని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. అధిష్ఠానం తన వైపే ఉందని అనుకుంటున్నానని, అయితే పార్టీ పెద్దలు ఏ నిర్ణయం తీసుకున్నా తాను కట్టుబడి ఉంటానని చెప్పారు.కాగా, పలువురు నాగసాధువులు శనివారంనాడు డీకే నివాసానికి వచ్చి ఆశీస్సులు ఇచ్చారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిగా కూడా ఉన్న డీకే మంగళవారంనాడు పలువురు కేంద్ర మంత్రులను కలుసుకునేందుకు ఢిల్లీ వెళ్తున్నారు. నదుల అనుసంధానం విషయంలో కేంద్ర ప్రభుత్వ జలవనరుల శాఖ తమను పిలిచినట్టు డీకే తెలిపారు. మహదయి, కృష్ణ వాటర్ అవార్డ్, మేకేదాటు, ఎగువ భద్ర ప్రాజెక్టులకు సంబంధించి చర్చించనున్నట్టు చెప్పారు.

# డాక్టర్లు స్వేచ్ఛగా విదేశాలకు వెళ్లవచ్చు



**లక్నో:** దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని యువ డాక్టర్లు ఇక ఫిర్యాదు చేయరాదు అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. దేశంలో ఉన్న వనరులను, సంస్థలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విదేశాలకు వెళ్లాలనుకుంటున్న యువ డాక్టర్లు స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని, కానీ విదేశాలకు వెళ్లే నెపంతో దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని నిందలు మోపరాదు అని మంత్రి నడ్డా పేర్కొన్నారు. లక్నోలో కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విదేశాలకు వెళ్లే యువ డాక్టర్లు స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని, కానీ భారత్‌లో సదుపాయాలు లేవని నిందలు చేయవద్దు అన్నారు. ఇక్కడ ఉన్న సంస్థలను, సదుపాయాల్ని వాడుకోవాలన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ వైద్య వ్యవస్థ పూర్తిగా మారిందన్నారు. దేశంలో ఆల్ ఇండియా ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంస్థల సంఖ్య ఇప్పుడు 23కు పెరిగిందన్నారు.

# శుభ్‌మన్ గిల్, జితేష్ శర్మలకు నిరాశ



**ఇషాన్ కిషన్, రింకూ సింగ్‌ల రీఎంట్రీ**

**న్యూజిలాండ్ తో టి20 సిరీస్‌కు జట్టు ఎంపిక..**

**జనవరి 21న ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం**


**2026 టీ20 వరల్డ్ కప్ కూ ఇదే జట్టు**

వచ్చే నెలలో న్యూజిలాండ్‌తో ఆడబోయే 5 టీ20ల సిరీస్‌కు భారత జట్టును ప్రకటించింది. ఈ జట్టులో వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు చోటు దక్కలేదు. అయితే వికెట్ కీపర్ ఇషాన్ కిషన్, బ్యాటర్ రింకూ సింగ్‌లకు అవకాశం వరించింది. అలాగే, జితేష్ శర్మకు సైతం ఈ సిరీస్‌లో చోటు దక్కలేదు. గిల్, జితేష్ స్థానంలో రింకూ సింగ్, ఇషాన్ కిషన్ చోటు దక్కించుకున్నారు.. భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్ జనవరి 21 న ప్రారంభం కానుంది. జనవరి 31తో చివరి టీ20 జరుగుతుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు ఎంపికైన జట్టు 2026 టీ20 వరల్డ్ కప్ ఆడుతుందని బీసీసీఐ స్పష్టం చేసింది. జితేష్ శర్మ, శుభ్‌మన్ గిల్‌ను టీ20 వరల్డ్ కప్ జట్టు నుంచి తొలగించారు. వారికి బీసీసీఐ అవకాశం ఇవ్వలేదు. 2026 టీ20 వరల్డ్ కప్, న్యూజిలాండ్‌తో టీ20ల సిరీస్‌కు నలుగురు బ్యాట్స్‌మెన్, ఇద్దరు వికెట్ కీపర్లు, ఇద్దరు స్పిన్ ఆల్ రౌండర్లు, ఇద్దరు పేస్ బౌలర్ ఆల్ రౌండర్లు, ముగ్గురు పేస్ బౌలర్లు, ఇద్దరు స్పిన్నర్లను బీసీసీఐ ఎంపిక చేసింది. 2026 టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లకు భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇస్తున్నాయి. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆల్ రౌండర్లు, స్పెషలిస్ట్ బ్యాటర్లు, వికెట్ కీపర్ బ్యాటర్లు, స్పిన్నర్లు, పేసర్లు కలిపి మొత్తం 15 మంది ఆటగాళ్లను ఎంపిక చేసింది. న్యూజిలాండ్ టీ20 సిరీస్‌తో పాటు టీ20 వరల్డ్ కప్ జట్టులో ఇషాన్ కిషన్ చోటు దక్కించుకున్నాడు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఇషాన్ కిషన్ జారండ్‌ను ఛాంపియన్‌గా నిలిపాడు. కిషన్ 500కు పైగా పరుగులు చేశాడు. జితేష్ శర్మ స్థానంలో ఇషాన్ కిషన్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. అలాగే, రింకూ సింగ్ కూడా జట్టులోకి రాబోతున్నాడు. రింకూ దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో భారత జట్టులో లేడు. ఫామ్ లేమితో సతమతం అవుతున్న స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌ను కివీస్‌తో భారత టీ20 జట్టు నుంచి, టీ20 వరల్డ్ కప్ జట్టులో ఎంపిక చేయలేదు. కాగా సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ 2026 జరగనుండటంతో రిజర్వ్ ప్లేయర్లను ప్రకటించలేదని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా తెలిపాడు. గాయపడ్డ ఆటగాళ్ల స్థానంలో కొత్త ప్లేయర్లను ఎంపిక చేయడం ఇబ్బంది కాదనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో బరిలోకి దిగే భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో బోర్డ్ సెక్రటరీ దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగిన టీమ్ సెలెక్షన్ సమావేశంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, సెలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం 15 మంది సభ్యులతో కూడిన భారత టీ20 ప్రపంచకప్ జట్టు వివరాలను చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు.మెగా టోర్నీలకు జట్టు ప్రకటించినప్పుడు రిజర్వ్ ప్లేయర్లను కూడా ప్రకటిస్తారు. గాయాలతో జట్టుకు దూరమైన ఆటగాళ్ల స్థానంలో వారిని జట్టులోకి తీసుకుంటారు. అయితే టీ20 ప్రపంచకప్ 2026 టీమ్‌కు రిజర్వ్ ప్లేయర్లను ప్రకటించలేదు. ఈ విషయంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. దేవజిత్ సైకియా వివరణ ఇచ్చాడు. 'ఈ టోర్నీ మన దేశంలోనే జరుగుతోంది కాబట్టి ఎవరైనా ఆటగాళ్లకు బదులుగా ఇతరులను ఎంపిక చేయడంలో మాకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. అందుకే ఈ జట్టు కోసం ప్రత్యేకంగా రిజర్వ్ ఆటగాళ్లను ప్రకటించలేదు.'అని దేవజిత్ సైకియా చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్‌తో 5 టీ20ల సిరీస్‌కు



భారత జట్టు(టీ20 ప్రపంచకప్ జట్టు): సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా. ఇండియా, న్యూజిలాండ్ టీ20 సిరీస్ 2026 షెడ్యూల్ జనవరి 21 – 1వ టీ20: జామ్తా (రాత్రి 7 గంటలకు) జనవరి 23 – 2వ టీ20: రాయ్‌పూర్ (రాత్రి 7 గంటలకు%) %జనవరి 25 – 3వ టీ20: గౌహతి (రాత్రి 7 గంటలకు) జనవరి 28 – 4వ టీ20: విశాఖపట్నం (రాత్రి 7 గంటలకు) జనవరి 31 %–% 5వ టీ20: తిరువనంతపురం (రాత్రి 7 గంటలకు)

## అక్షర్ పటేల్‌కు ఊహించని ప్రమోషన్



వచ్చే ఏడాది జరగనున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 కోసం ఎదురుచూస్తున్న కోట్లాది మంది భారత క్రికెట్ అభిమానుల నిరీక్షణకు తెరపడింది. ఫిబ్రవరి–మార్చి నెలల్లో భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 కోసం టీమిండియాను నేడు అధికారికంగా ప్రకటించారు. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో కూడిన సెలక్షన్ కమిటీ సుదీర్ఘ చర్చల అనంతరం 15 మంది సభ్యుల తుది జట్టును ఖరారు చేసింది. నిన్న అహ్మదాబాద్‌లో సౌతాఫ్రికాతో మ్యాచ్ ముగించుకుని సూర్యకుమార్ యాదవ్ ఆలస్యంగా రావడంతో ప్రెస్ కాన్ఫరెన్స్ కొంచెం ఆలస్యంగా ప్రారంభమైంది. 2024 ప్రపంచకప్ గెలిచిన జట్టుతో పోలిస్తే ఈసారి టీమిండియాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాల రిటైర్మెంట్ తర్వాత.. దాదాపు ఏడు కొత్త ముఖాలు ఈ మెగా టోర్నీలో కనిపించబోతున్నాయి. యువ ఆటగాళ్లపై నమ్మకంతో పాటు అనుభవజ్ఞుడైన అక్షర్ పటేల్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించడం విశేషం. ప్రపంచకప్‌తో పాటు వచ్చే నెలలో న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌కు కూడా ఇవే జట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపికలో యశస్వి జైస్వాల్, రింకూ సింగ్‌ల విషయంలో తీవ్ర చర్చ జరగగా, రింకూను ప్రధాన జట్టులోకి తీసుకుని జైస్వాల్‌ను రిజర్వ్ ప్లేయర్‌గా ఉంచారు. అలాగే ఐపీఎల్‌లో మెరిసిన నితీష్ కుమార్ రెడ్డి, రియాన్ పరాగ్‌లను కూడా బ్యాకప్ ఆటగాళ్లుగా ఎంపిక చేశారు. హోమ్ గ్రౌండ్‌లో మ్యాచ్‌లు జరగనుండటంతో స్పిన్ విభాగానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్‌లను సెలెక్టర్లు జట్టులోకి ఆహ్వానించారు.

## రొమాంటిక్ సైడ్‌తోనూ పాండ్యా దుమ్ములేపాడు

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం సాక్షిగా టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అటు బ్యాటింగ్‌తోనూ, ఇటు తన రొమాంటిక్ సైడ్‌తోనూ దుమ్ములేపాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదో టీ20లో హార్దిక్ కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది, భారత్ తరపున రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. భారత్ ఈ మ్యాచ్‌లో 30 పరుగులతో గెలవడమే కాకుండా, సిరీస్‌ను 3–1తో కైవసం చేసుకుంది. అయితే, స్టేడియంలో హార్దిక్ బ్యాటింగ్ కంటే అతను తన ప్రేయసికి ఇచ్చిన ముద్దులే ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. హార్దిక్ తన రికార్డు హాఫ్ సెంచరీ పూర్తి చేసిన వెంటనే, గ్యాలరీలో కూర్చుని తనను ఉత్సాహపరుస్తున్న ప్రేయసి మహీకా శర్మ వైపు చూస్తూ ముద్దుల వర్షం కురిపించాడు. తన ప్రియుడి మెరుపు ఇన్నింగ్స్‌ను చూసి మురిసిపోయిన మహీకా, ఎంతో ఆనందంతో రియాక్ట్ అయ్యింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఆసియా కప్ 2025లో గాయపడిన తర్వాత హార్దిక్‌కు ఇదే మొదటి అంతర్జాతీయ సిరీస్. రీ-ఎంట్రీలోనే 186 స్ట్రైక్ రేట్‌తో పరుగులు రాబట్టడమే కాకుండా, మూడు వికెట్లు కూడా పడగొట్టి తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు.మ్యాచ్ అనంతరం హార్దిక్ మాట్లాడుతూ ఒక ఆసక్తికరమైన విషయం చెప్పాడు. తను రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేశానన్న విషయం తనకు డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్ళే వరకు తెలియదట. "నేను అవుట్ అయి వెనక్కి వెళ్ళినప్పుడు మా సోషల్ మీడియా టీమ్ ఈ విషయం చెప్పింది. నా మొదటి రియాక్షన్ ఏంటంటే.. ఛా, ఫస్ట్ ప్లేస్ మిస్ అయ్యానా! అని. కానీ యువరాజ్ పాజీ (12 బంతుల్లో 50) రికార్డు ఇంకా పదిలంగా ఉన్నందుకు సంతోషంగా ఉంది" అని సరదాగా వ్యాఖ్యానించాడు. వచ్చే ఏడాది (2026) ఫిబ్రవరిలో జరగబోయే టీ20 వరల్డ్ కప్‌కు ముందు హార్దిక్ ఇలాంటి భీభత్సమైన ఫామ్‌లోకి రావడం టీమిండియాకు కొండంత బలాన్నిస్తోంది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో భారత్ తన మొదటి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న అమెరికాతో ఆడనుంది. ఆటలోనూ, ప్రేమలోనూ హార్దిక్ చూపిస్తున్న ఈ జోరు చూస్తుంటే వరల్డ్ కప్‌లో ప్రత్యర్థులకు చుక్కలు కనిపించడం ఖాయమని ఫ్యాన్స్ సంబరపడుతున్నారు.




## గౌతమ్ జట్టు మేనేజర్‌గా వ్యవహరించాలి

**భారత్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్**



టీమ్‌ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఇటీవల కాలంలో అనేక విమర్శలకు గురవుతున్నాడు. ఏడాది కాలంలోనే స్వదేశంలో వరుసగా జరిగిన రెండు టెస్టు సిరీస్‌లు క్లీన్ స్వీప్ అవ్వడంతో ట్రోల్స్ ఎక్కువయ్యాయి. జట్టులో గంభీర్ ఫేవరెటిజం చూపిస్తున్నాడన్న ప్రచారమూ జరుగుతోంది. ఈ క్రమంలో భారత్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ తాజాగా గంభీర్‌పై కీలక వ్యాఖ్యలు చేశాడు. గంభీర్ కోచ్ కాదని, అతడు భారత జట్టు మేనేజర్ అని అన్నాడు. రీసెంట్‌గా కోల్‌కతాలో జరిగిన 'ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాలు' కార్యక్రమంలో కపిల్ దేవ్ పాల్గొన్నాడు. ఈ ఈవెంట్‌లోనే కపిల్ ఈ వ్యాఖ్యలు చేశాడు. మోడ్రన్ క్రికెట్‌లో, ప్లేయర్లను మేనేజ్ చేయడమే హెడ్ కోచ్ పాత్ర అని, అంతేకానీ నేరుగా వాళ్లను కోచింగ్ చేయడం కాదని కపిల్ అన్నాడు. 'ఈ రోజుల్లో కోచ్ అనే పదం కామన్ అయిపోయింది.

## మిడిలార్డర్ బలాన్ని పెంచేందుకే గిల్‌ను తప్పించాం



**• టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్**

మిడిలార్డర్ బలాన్ని పెంచేందుకే శుభ్‌మన్ గిల్‌ను పక్కన పెట్టాల్సి వచ్చిందని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. టాపార్డర్ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌తో పాటు రింకూ సింగ్ కోసం గిల్‌ను తప్పించాల్సి వచ్చిందని వివరణ ఇచ్చాడు. శుభ్‌మన్ గిల్ పేలవ ఫామ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోలేదని, అతని క్లాస్ బ్యాటింగ్‌పై తమకు ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో బరిలోకి దిగే భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో బోర్డ్ సెక్రటరీ దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగిన టీమ్ సెలెక్షన్ సమావేశంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, సెలెక్టర్లు పాల్గొన్నారు. ఇషాన్ కిషన్, రింకూ సింగ్ కోసం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. 'శుభ్‌మన్ గిల్ ఫామ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోలేదు. టీమ్ కాంబినేషన్ కోసమే అతన్ని పక్కనపెట్టాల్సి వచ్చింది. టాపార్డర్‌లో మాకు ఒక వికెట్ కీపర్ కావాల్సి వచ్చింది. అంతే తప్పా శుభ్‌మన్ గిల్ ఫామ్ గురించి కాదు. అతని క్వాలిటీ మీద మాకు ఎలాంటి సందేహాలు లేవు.అతను ఒక అద్భుతమైన ఆటగాడు. మాకు రింకూ సింగ్ అవసరం ఏర్పడింది. అలాగే వాషింగ్టన్ సుందర్‌ను కొనసాగించాలనుకున్నాం. అందుకే రకరకాల కాంబినేషన్లకు అనుగుణంగా ఉండటానికి మేం ఫ్లెక్సిబిలిటీని కోరుకున్నాం. ఆ కారణంతోనే ఈ జట్టును ఎంచుకున్నాం. గిల్ క్లాస్ విషయంలో మాకు ఎలాంటి ప్రశ్నలు, సందేహాలు లేవు'అని సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు.

తన పేలవ ఫామ్‌పై స్పందించిన సూర్యకుమార్ యాదవ్.. త్వరలోనే మునపటి సూర్యను చూస్తారని విశ్వాసం వ్యక్తం చేశాడు. 'ఈ గడ్డు కాలం చాలా కాలంగా కొనసాగుతోంది. ఆటగాళ్లందరూ తమ కెరీర్‌లో ఏదో ఒక సమయంలో ఇలాంటి దశను అనుభవిస్తారు. ఈ కఠిన పరిస్థితులను ఎలా అధిగమించాలో నాకు తెలుసు. లోపాలను సరిదిద్దుకోవడానికి నాకు సమయం ఉంది. త్వరలోనే మీరు కచ్చితంగా బ్యాటర్ సూర్యను మళ్లీ చూస్తారు.'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు.

# వెన్నులో వణుకు పుట్టించేలా ఈషా

## 25న వస్తోన్న థ్రిల్లర్

త్రిగుణ్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో రానున్న హారర్ థ్రిల్లర్ 'ఈషా'. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. ఆ హారర్ థ్రిల్లర్ డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో విడుదలకు మందు ఆసక్తికరమైన వీడియోను టీమ్ పంచుకుంది. ఆత్మ అంటే అదేనేమో అంటూ హీరోయిన్ చెప్పే డైలాగు భయపెట్టేలా ఉంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' వంటి వరుస కల్ట్ హిట్స్ అందించిన సక్సెస్‌ఫుల్ జోడీ బన్నీ వాస్, వంశీ నందిపాటి. కలిసి ఇప్పుడు ప్రేక్షకులకు ఒక క్రేజీ హారర్ అనుభూతిని పంచడానికి సిద్ధమయ్యారు. వీరి సరికొత్త హారర్ థ్రిల్లర్ 'ఈషా' డిసెంబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ చిత్రం గురించి మేకర్స్ తాజాగా 'వార్నింగ్ వీడియో' పేరిట ఒక ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. సాధారణంగా హారర్ సినిమాలకు ట్రైలర్లు రావడం సహజం, కానీ ఇలా ప్రత్యేకంగా హెచ్చరిక వీడియో రావడం హారర్ జానర్‌లోనే ఇదే తొలిసారి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఆత్మలు, దెయ్యాలు లేవని బలంగా నమ్మే కొందరు స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలోని మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎండగట్టాలని వారు భావిస్తారు. ఈ క్రమంలో వారికి పృథ్వీరాజ్ (బబ్లూ) నుంచి ఒక సవాలు ఎదురవుతుంది. 'ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..?' అంటూ ఆయన




విసిరే ఛాలెంజ్‌తో ఈ స్నేహితుల బృందం ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. మనుషుల్లాగే కొన్ని స్థలాలు కూడా పుట్టుకతోనే శాపగ్రస్తమై ఉంటాయి.. కాలక్రమేణా అవి ఆత్మలకు నిలయాలుగా మారుతాయని దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఇచ్చిన వార్నింగ్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. ట్రైలర్ మరియు ఈ వార్నింగ్ వీడియోలో కనిపించిన విజువల్స్ భయానకంగా ఉన్నాయి. ముఖ్యంగా పాడుబడిన బంగ్లా, క్షుద్ర పూజల సెటప్, బ్లూ అండ్ డార్క్ థీమ్ విజువల్స్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి.సంతోష్ లైటింగ్, ధృవన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాలోని భయాన్ని రెట్టింపు చేస్తున్నాయి. ఈ చిత్రంలో ఉండే సడన్ ట్విస్ట్‌లు చూసి భయపడే అవకాశం ఉన్నందున, గుండె బలహీనంగా ఉన్నవారు ఈ సినిమా చూడకూడదని చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇందులో త్రిగుణ్, అఖిల్ రాజ్ హీరోలుగా నటించగా, హెబ్బా పటేల్ హీరోయిన్‌గా నటించింది. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. డిసెంబర్ 25న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో చూడాలి.

# మళయాల దర్శకుడు, నటుడు శ్రీనివాసన్ కన్నుమూత



మలయాళ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ సీనియర్ నటుడు, దర్శకుడు, స్క్రీన్ ప్లే రచయిత శ్రీనివాసన్ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. నటుడిగా, దర్శకుడిగా, కథా రచయితగా ఐదు దశాబ్దాల పాటు కేరళ చిత్ర పరిశ్రమకు ఆయన సేవలు అందించాడు. 'వడక్కునోక్కియంత్రం', 'చింతవిశిష్టాయ శ్యామల' వంటి చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ అవార్డులను కూడా అందుకున్నారు. శ్రీనివాసన్ ఇద్దరు కుమారులు వినీత్ శ్రీనివాసన్, ధ్యాన్ శ్రీనివాసన్ కూడా మలయాళ చిత్ర పరిశ్రమలో నటులుగా, దర్శకులుగా రాణిస్తున్నారు. శ్రీనివాసన్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, నటులు మోహన్ లాల్, మమ్ముట్టి సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# సామాజిక సందేశంతో వస్తోన్న దండోరా

గ్రామీణ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రాలకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారన్న విషయం తెలిసిందే. తాజాగా అదే కోవలో తెలంగాణ సంస్కృతి, సామాజిక అంశాల కలబోతగా వస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో విడుదల చేస్తుండటం సినిమాపై మరింత అంచనాలను పెంచింది. విదేశాల్లో కూడా ఈ సినిమా భారీ ఎత్తున విడుదల కానుంది. సుమారు 200కు పైగా థియేటర్లలో ప్రదర్శితం కాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి, ఈ నెల 23నే అక్కడ ప్రీమియర్స్ పడనున్నాయి. అయితే ఈ




సినిమా విడుదలకు ఇంకా వారం కూడా లేకపోవడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.గ్రామాల్లో ఇంకా కులం అడ్డుగోడలు తొలగిపోలేదని ఈ ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. ప్రారంభంలోనే ఊరి బయట శవాన్ని మోసుకెళ్తున్న దృశ్యాలు, 'మన చావు పుట్టుకలన్నీ ఈ ఊరి బయట రాసిండ్రా ఆ దేవుడు..' అనే డైలాగ్ ఈ సినిమాలో ఉన్న సామాజిక కోణాన్ని ఎత్తి చూపుతోంది. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మానికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందుమాధవి, రాధ్య, అదితి భావరాజు వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. మార్క్ కె. రాబిన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. తెలంగాణ మట్టి వాసనతో కూడిన కథలను ఇష్టపడే వారికి 'దండోరా' ఒక మంచి అనుభూతిని ఇస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

-------------



# బిర్యానీ పాత్రలో సంపూర్ణేశ్ బాబు

నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి ఒక షాకింగ్ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో 'బర్నింగ్ స్టార్' సంపూర్ణేష్ బాబును ఒక సరికొత్త ఊర మాస్ అవతారంలో శ్రీకాంత్ ఓదెల చూపించబోతున్నాడు. ఎప్పుడూ తనదైన కామెడీతో నవ్వించే సంపూర్ణేష్ బాబును దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పూర్తిగా మార్చేశాడు. 'ది ప్యారడైజ్' చిత్రంలో సంపూ 'బిర్యానీ' అనే మాస్ పాత్రను పోషిస్తున్నారు. శుక్రవారం విడుదలైన ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పోస్టర్‌లో సంపూర్ణేష్ బాబు ఒంటి నిండా రక్తపు మరకలతో, భుజాన గొడ్డలి వేసుకుని, బీడీ తాగుతూ చాలా సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న క్రూరత్వం చూస్తుంటే, ఇందులో ఆయన కేవలం కామెడీకి పరిమితం కాకుండా ఒక పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంలో హీరో నాని (జడల్) కి అత్యంత సన్నిహితుడైన స్నేహితుడిగా, ప్రాణమిచ్చే నమ్మకస్థుడిగా 'బిర్యానీ' పాత్ర ఉండబోతోంది. ఈ పాత్ర కోసం సంపూర్ణేష్ బాబు చాలా బరువు తగ్గి, తన బాడీ లాంగ్వేజ్‌ను కూడా పూర్తిగా మార్చుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

ర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన సినిమాల్లో పాత్రలను చాలా సహజంగా, గంభీరంగా చూపిస్తారు. 'దసరా'లో కమెడియన్లను కూడా సీరియస్ పాత్రల్లో చూపించినట్లుగానే, ఇప్పుడు సంపూ లోని యాక్షన్ యాంగిల్‌ను బయటకు తీయబోతున్నారు. 'హైదరాబాద్ నేపథ్యంలో సాగే కథలో 'బిర్యానీ' లేకుండా ఉండదు' అంటూ ఈ పాత్రను ఇంట్రడ్యూస్ చేసిన తీరు వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో నానితో పాటు, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ఈ సినిమా 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో (తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్) గ్రాండ్‌గా విడుదల కానుంది.


# నెట్‌ఫ్లిక్స్‌లోకి వస్తోన్న ఆంధ్రా కింగ్ తాలూకా

రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'.. తెలుగు సినీ అభిమాని కథగా నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా విడుదలై నెల కూడా తిరక్కుండానే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 25 నుంచి తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. విషయాన్ని తెలుపుతూ నెట్‌ఫ్లిక్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. మహేశ్‌బాబు.పి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సూర్య(ఉపేంద్ర) పేరుమోసిన సూపర్‌స్టార్. అశేషమైన అభిమానుల అతని సొంతం. అయితే.. తనకు బ్యాడ్ పిరియడ్ నడుస్తూ ఉంటుంది. విడుదలైన సినిమాలన్నీ ఎ÷-లాపులవుతుంటాయి. ఈ క్రమంలో సూర్య వందవ చిత్రం షూటింగ్ మధ్యలోనే ఆగిపోతుంది. చిత్రాన్ని నిర్మించలేనని నిర్మాత చేతులెత్తేస్తాడు. ఓ మూడు కోట్లు ఉంటే సినిమా పూర్తవుతుంది. ఆ మూడు కోట్ల కోసం సూర్య ప్రయత్నాలు మొదలుపెడతాడు. ఈ క్రమంలో ఓ నిర్మాతను డబ్బు అడుగుతాడు.




# పవన్‌తో నటించడం ఒక గౌరవం: రాశీ ఖన్నా

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా, దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న నటి రాశీ ఖన్నా, తాజాగా షూటింగ్ సెట్స్ నుంచి కొన్ని ఆసక్తికరమైన బీటీఎస్ (బిహైండ్ ది సీన్స్) వీడియోలను అభిమానులతో పంచుకున్నారు.తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ వీడియోలను షేర్ చేసిన రాశీ ఖన్నా, "యాక్షన్ మరియు కట్ మధ్య నిశ్శబ్దం ఉంటుంది. కొన్నిసార్లు నవ్వులు కూడా ఉంటాయి" అంటూ దర్శకుడు హరీశ్ శంకర్‌ను ట్యాగ్ చేశారు. ఈ వీడియోలను చూస్తే, ఆమె షూటింగ్‌ను ఎంతో ఆస్వాదిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.గతంలో కూడా పవన్ కల్యాణ్‌తో కలిసి పనిచేయడం ఒక గౌరవంగా భావిస్తున్నానని రాశీ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆయనతో దిగిన ఒక సెల్ఫీని పంచుకుంటూ, ఈ సినిమా తనకు ఎప్పటికీ గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం అని ఆమె తెలిపారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో రాశీ 'శ్లోక' అనే ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం గతంలో ప్రకటించింది.మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల మరో కథానాయికగా నటిస్తోంది.



Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com